తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస
పత్రిక

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

ఏప్రిల్-2023

వెల: ₹20



కుర్రాళ్ళకి పండాల్సింది
చేతిలో గోరింటాకు కాదు!
మరి...?!

# KNR PROPERTIES

BUY / SELL / LEASE



- కమర్షియల్ బిల్డింగ్స్
- విల్లాస్
- ఆఫీస్ స్పేస్
- అపార్ట్‌మెంట్ ఫ్లాట్స్
- ఇండిపెండెంట్ హౌసెస్
- ప్లాట్స్ & ల్యాండ్స్

**BANK LOAN AVAILABLE**



Ramakrishna Reddy

**Address**

890, Hitech City, Hyderabad- 500 081, Telangana

email: knrproperties54@gmail.com

Contact:

**80000 45500**

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

# హాస్యానందం

ఏప్రిల్-2023

20వ సంవత్సరం

226 వ సంచిక

జీ'వనం'లో నవ్వు
నవ వసంతం

*Publisher& Editor-*
*Ramu.P*

*Full Pillar* :
Bnim

*Cartoon Feature Editor*:
Bachi

*D.T.P:*
P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:*
Surya

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, (I.A.S.Retd)
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Dr.V.V.Rama Kumar
Gudibandi Venkata Reddy

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
Cartonist JSR
K.Sundaresayya &
Satyavathi
Cartonist Ramprasad
Md.Raj Mohammed
A.V.Krishna Murthy

*Creative Team*
Dr. K.Ramakrishna
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Gandhi
GopalKrishna
Sangram
Krishna
Bomman
Venkat
Dayakar



ముఖచిత్రం: సంయుక్త మీనన్
కార్టూన్: లేపాక్షి

సంవత్సర చందా-రూ.300/-
(పోస్టల్ చార్జీలతో)

2 సంవత్సరాల చందా-రూ.500/-
(పోస్టల్ చార్జీలతో)

జీవిత చందా- రూ.5000/-లు

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**

email:
hasyanandam.mag@gmail.com
web:
www. hasyanandam.com

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad.
Cell. 9666680857.

గమనిక:
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...


## కథలు...

| | | |
|---|---|---|
| చందమామపై హనీమూన్ | -పి.ఎన్.బి.యస్.శ్రీనివాస్ | -14 |
| అయ్యో రామ(ం)! | -నిమ్మగడ్డ కృష్ణ | -18 |
| నవ్వు వెనుక | -గంగాధర్ వడ్లమన్నాటి | -22 |
| పెళ్ళి తమాషాలు | -డా. కేతవరపు రాజ్యశ్రీ | -28 |
| మంత్రా... మజాకా! | -కంచనపల్లి ద్వారకనాథ్ | -32 |
| పుట్టినిల్లు | -బొందల నాగేశ్వరరావు | -36 |
| మళ్ళీ మొదలు! | -కె.వి.సుమలత | -40 |
| ఫైనల్ రిజల్ట్ | -బుద్ధవరపు కామేశ్వరరావు | -44 |

## శీర్షికలు

| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -7 |
| తెలుగా మజాకా?! | -డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -10 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -12 |
| ఫన్‌పంచ్ | -గుండు సుదర్శన్ | -26 |
| తర్కారావు కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -43 |

## స్పెషల్స్

| | | |
|---|---|---|
| బంగార్తల్లి-2023 పురస్కార ప్రదానోత్సవం! | | -8 |
| విచిత్రపోళ్ళు | -బొమ్మన్ | -17 |
| మన 'బ్నిం' కు జేజేలు! | | -21 |
| డాక్టర్ డింగరి | -దయాకర్ | -25 |
| రాజకీయ చిత్రాలు | | -50 |

## సీరియల్

| | | |
|---|---|---|
| ఇందు చందు-నవ్వులవిందు | -కండ్లకుంట శరత్‌చంద్ర | -46 |

## కార్టూన్ శీర్షికలు

| | | |
|---|---|---|
| చేపా చేపా నవ్వించమ్మా | -మల్లాది వెంకటకృష్ణమూర్తి | -13 |
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -16 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -20 |
| భలే బాస్ | -బొమ్మన్ | -20 |
| కోర్టూన్లు | -బాచి | -22 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -30 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -34 |
| లోకం తీరు | -కృష్ణ | -38 |
| డబుల్ ధమాకా | -లేపాక్షి | -39 |
| హాస్యబ్రహ్మలు | -అంతోటి ప్రభాకర్ | -39 |
| కార్టూన్ బరస్ట్ | -వడ్డేపల్లి వెంకటేష్ | -48 |
| దెయ్యాల గోల | -ఎన్.పి.ఎస్.రావు | -48 |
| హే భగవాన్ | -భగవాన్ | -49 |














## ఈ సంచికలో కార్టూనిస్టులు

- జయదేవ్
- సరసి
- బాచి
- లేపాక్షి
- గాంధి
- దయాకర్
- నాగిశెట్టి
- ప్రసిద్ధ
- రామ్‌శేషు
- భగవాన్
- దొరశ్రీ
- శర్మ
- టి.ఆర్.బాబు
- శేషయ్య
- సునీల్
- బొమ్మన్
- ఎన్.పి.ఎస్.రావు
- భాను
- అరుణ్
- డేవిడ్
- దాస్
- తోపల్లి ఆనంద్
- వడ్డేపల్లి వెంకటేష్
- భాను
- కృష్ణ
- సుధాకర్
- శేఖర్
- క్రిష్
- గౌతమ్
- ప్రసాద్‌కాజ
- మణి
- పూర్ణ
- సునీల్
- డి.శంకర్
- కన్నాజీరావు
- రంగాచారి
- సుందరం
- పద్మ
- శేఖర్‌బాబు
- జెఎన్నెమ్
- నాథ్
- కాశ్యప్
- సురేంద్ర

## హాయ్...సానందంగా...



**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... హాస్యప్రియులకు సన్నిహితులకు**
**హాస్యాభివందనాలు!**

కలసి వుంటే కలదు సుఖం. సుఖం అన్నదానికి అందరూ ఇష్టపడుతున్నాం... దాని కోసం పరుగెడుతున్నాం... కానీ ఆ 'కలసి' వుంటే అన్న ప్రక్రియని విస్మరిస్తున్నాం. ముఖ్యంగా అభిప్రాయ భేదాలతో ఈ మధ్య మనుషులు దూరం కావటం బాధాకరం. అభిప్రాయభేదాలు ఉండటం అంటే శతృత్వం పెంచుకోవటం కాదు! ఒక అంశం మీద ఒకోక్కరికీ ఒకో అభిప్రాయం ఉంటుంది. ఆ అభిప్రాయాల్ని వీలుంటే గౌరవిద్దాం! నచ్చకపోతే వదిలేద్దాం! అంతేగానీ మన అభిప్రాయాలు వాళ్ళ మీద రుద్దీ... నానా రభస చేసి, తోటివారిని దూరం చేసుకోవద్దు! ఇప్పుడు అందరూ 'నాదీ'...'నేను' అనే చట్రంలో ఇరుక్కుని బతుకుతున్నాం. ఉన్న ఆ 'కాస్త' బంధాలు, స్నేహాలు... చేతులారా మన మాటే నెగ్గాలనే కారణంగా... నా అభిప్రాయమే కరెక్ట్ అన్న అహంతో తెంచుకుంటున్నామేమో ఒక్కసారి ఆలోచిద్దాం! ఒకవేళ ఏదైన ఒక విషయమై 'అయినవాళ్ళతో' వాదనలు పెట్టుకుంటే మాత్రం ఎదుటివాళ్ళ మనోభావాలు దెబ్బతినకుండా, మన అభిప్రాయాలు చెప్పాలి! అలానే ఎదుటివారి అభిప్రాయాలు వినాలి! అంతేగానీ అభిప్రాయలు కలవలేదని వారిని ద్వేషించటం... శతృత్వం పెంచుకోవటం అర్ధం లేని చర్యలు! మనల్ని మనం నియంత్రించుకోలేనప్పుడు... ఏదైనా విషయంపై భేదాభిప్రాయాలు ఉంటే... ఆ చర్చకు దూరంగా ఉండటమే శ్రేష్ఠం! ఎదుటివారి మనోభావాలను గౌరవిస్తూ... మన మాటలతో వారిని బాధపెట్టకుండా ఉండే చర్చలు శ్రేయోదాయకాలు!

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....





✦ **ఓంప్రకాశ్ నారాయణ వడ్డి**
**(ఓ నావ) హైదరాబాద్.**

**హా**స్యానందం మార్చి నెల సంచికలో కార్టూనిస్ట్ పద్మగారి ఫన్ ప్రశ్నలకి సుదర్శనంగారి పంచ్ జవాబులు భలే నవ్వించాయి... కొన్ని గమ్మత్తైన హాస్యాన్ని చిలకరించాయి. వాటిలో 'చెట్టు ముందా?... విత్తు ముందా?' అన్న ప్రశ్నకి... 'నేల ముందు' అని చెప్పిన జవాబు ఓ క్షణం ఆగి, మళ్ళీ చదివాను... ఆ స్పార్క్, ఆ థాట్ ఆశ్చర్యం కలిగించింది. అలాగే, విశ్వనాథ్‌గారికి ఆయన నిండు మనసుతో రాసిన 'కర్మ యోగి కి నివాళి' బావుంది.



✦ **పి.వి.సునీత, విశాఖపట్టణం**

**అ**మ్మాయే నవ్వితే' కథలపోటీలో బహుమతి పొందిన 15 కథలు, అన్నీ బావున్నాయి. ఒక అమ్మాయి నవ్వితే ఎన్ని రకాల అర్థాలు స్ఫురిస్తాయో ఈ కథల్లో రచయితలు, రచయిత్రులు ఆవిష్కరించారు. కథలు ఒక ఎత్తైతే వాటికి గోపాలకృష్ణగారు వేసిన బొమ్మలు మరో ఎత్తు! అన్ని కథలు ఒకే సంచికలో రావటం కూడా బాగుంది.

✦ **సిహెచ్.పద్మజ,ముంబై**

**మా**ర్చి హాస్యానందంలో ప్రచురించిన బహుమతి పొందిన కథలు చాలా బావున్నాయి. పేజీ డిజైన్‌లో విజేతలకు మీరిచ్చిన ప్రాధాన్యం ఇంకా బావుంది. ఈ సంచికలో హాయ్ సానందంగాలో– మనుషులకు ఈ మధ్య అసహనం పెరిగిపోయింది అన్న మాటలు అక్షరసత్యం! ఎక్కడెక్కడో ఆనందాన్ని వెతుక్కుంటూ మనలోనే ఉన్న దాన్ని కనిపెట్టలేక, నానాపాట్లు పడుతున్న మనం ఆ 'పాయింట్'ని మిస్ అవుతున్నాం! అన్న సూచన అందరికీ శిరోధార్యం! ఆనందంగా ఉండటానికి ప్రతినెలా మీరిస్తున్న సూచనలు పాటిస్తే ఆనందం మన సొంతం అవుతుందనేది సత్యం!

✦ **ఆర్.కృష్ణప్రసాద్,నెల్లూరు**

**మా** ఆనందానికి కారణమౌతున్న హాస్యానందం... ప్రతినెలా మమ్మల్ని నవ్విస్తూ... ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. పత్రికలే కరువైపోతున్న ఈ రోజుల్లో టంచన్‌గా మొదటివారం మా చేతిలో ప్రత్యక్షమౌతున్న హాస్యానందానికి అభినందనపూర్వక కృతజ్ఞతలు.

✦ **జి.వి.రాజారామ్, గొప్పిలి**

**మా**ర్చి హాస్యానందంలో ప్రచురించిన 'గుండు'గారి 'ఫన్' సమాధానాలు బావున్నాయి. తెరమీద ఒక కమెడియన్‌గా కనిపించే వీరిలో మరో కోణాన్ని మాకు పరిచయం చేస్తున్న మీకు అభినందనలు. బొమ్మలు ఈ పేజీలను మరింతం ఆకర్షణీయంగా చేస్తుంది. సంగ్రామ్ గారికి అభినందనలు.

## హాస్యానందం– సన్మోహనాస్త్రం!

అందాలభామల చిరునవ్వుల ముఖచిత్రంతో
అందంగా ముస్తాబై ప్రతి నెలా ప్రత్యక్షం అవుతుంది– హాస్యానందం
భుజం తట్టి ప్రోత్సాహాన్ని అందించే రాముగారి సంపాదకీయం
కార్టునిస్టుల కలాల్ని,బలాన్ని పెంచే శక్తి మంత్రం!
కార్టూనిస్టుల, రచయితల పోటీలకు పోటీపడే ప్రకటనలు...
హాస్యానందానికి ప్రత్యేక తలమానికలు!
స్మారక కార్టున్ పోటీలు...
వారి జ్ఞాపకాలను పదిలపరిచే మధుర స్వప్నాలు!
లబ్ద ప్రతిష్ట రచయితల హాస్యకథలు...
నవరసాల హాస్య గుళికలు నవ్వుల పువ్వుల పరిమళాలు!
కార్టునిస్టులప్రత్యేక సంచికలు...
వారి మజిలీలు, అనుభవాల ప్రయాణపు సోపానాలు!
ప్రముఖ రచయితలు, కార్టునిస్టుల ఫన్ ప్రశ్నలకి...
సుదర్శనంగారి అద్వితీయ చాతుర్య సమాధాన తుణీరాలు!
కార్టునిస్టుల సభలు, సన్మానాల చిత్రమాలికలు...
ఎందరో అభిమానులను చూరగొనే దృశ్యాలు!
స్పెషల్స్... సీరియల్స్... కథలు... కార్టూన్లు...
ఆరోగ్యకరమైన హాస్యాన్ని వేదజల్లె సుగంధ పరిమళాలు!
తర్కం ఇమిడిన తర్కారావు కథలు...
ఆలోచనలు రేకెత్తించే హాస్యపు మణిమకుటాలు!
ఇందు చందు కురిపించే నవ్వులు...
హాస్య ప్రియులకు చక్కని విందులు!
ప్రపంచ తెలుగు కార్టునిస్టులు పాల్గొనే అంశాలు...
నెల నెలా వెన్నెల... సుధాంశ కిరణాలు!
హాస్యానందం ఒక కమనీయం, రమణీయం, మహనీయం...
ఆరోగ్యానికి ఇది దివ్య ఔషదం!
మనస్సులో, మనుష్యులలో హాస్యాని పుట్టించే...
సన్మోహనాస్త్రం!

**–కంచనపల్లి ద్వారకనాథ్**



**సృష్టిలో నవ్వే లక్షణం ఒక్క మనిషికే ఉంది!...**
**దాన్నలా మరుగున పడేయకండి!**
**ఆ 'సవాలక్ష' కారణాలని మరుగున పడేయడానికి**
**హాస్యానందం**
**చందాదారులుగా చేరండి.**

# ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు
**ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**




కార్టూన్ ఇష్టులు
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్
**శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
ఈ కార్టూన్‌కి **500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.



కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి **500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






## ఆత్మీయంగా... ఆనందంగా...

# బంగార్తల్లి-2023 పురస్కార ప్రదానోత్సవం!

- ✦ శ్రీ దండెంరాజు ఫౌండేషన్ కథల పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం.
- ✦ నార్త్ కోస్టల్ ఆంధ్ర కార్టూనిస్టుల ఫోరమ్ (N C C F) కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం.

**అ**మ్మను మించిన దైవం లేదని, జీవితకాలం సేవ చేసినా తీరని రుణం అమ్మదని చెబుతూ పలువురు ప్రముఖులు చేసిన ప్రసంగాలు, వివిధ పోటీల విజేతల బహుమతి ప్రదానోత్సవం... అన్నీ కలిసి ఓ అందమైన సాయంత్రాన్ని అందించాయి.

హాస్యానందం పత్రిక వ్యవస్థాపక సంపాదకులు శ్రీ రాముపండా గారి మాతృమూర్తి దివ్యశ్రీ జాంబువతి గారి సంస్మరణ పూర్వకంగా ఏటా అందిస్తున్న **బంగార్తల్లి పురస్కార ప్రదానోత్సవం** మార్చి 19వ తేదీన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సమావేశ మందిరంలో వైభవంగా జరిగింది.

ఈ సభలో అతిథులుగా– 'కళారత్న' **శ్రీ బ్నిం,** ఆకాశవాణి విజయవాడ కేంద్రం డైరెక్టర్(రి) **శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి,** ఎ.పి. స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ కమాండెంట్ **డా॥ కె.ఎన్.రావు,** శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు **డా॥ డి.ఎన్.వి.రామశర్మ,** ప్రఖ్యాత సీనియర్ కార్టూనిస్టు **శ్రీ ఏవీఎమ్,** డయాబెటాలజిస్ట్, డాక్టర్స్ స్మైల్ క్లబ్ వ్యవస్థాపకులు **డా॥ వి.వి. రామకుమార్,** కార్టూనిస్టులు, కళాపోషకులు **శ్రీ కె.వి.వి. సత్య నారాయణ** పాల్గొన్నారు.

తొలుత డాక్టర్ కేఎన్‌రావు, శ్రీమతి అలిమేలుమంగ దంపతులు సుదీర్ఘమైన శంఖారావం చేస్తూ కార్యక్రమానికి శుభారంభాన్ని ఇచ్చారు.

కార్యక్రమంలో తొలుత హాస్యానందం వ్యవస్థాపక సంపాదకులు శ్రీరాముపండా స్వాగతోపన్యాసం చేస్తూ...

హాస్యానందం పత్రిక ఆవిర్భావాన్ని, పత్రిక నిర్వహణలో ఎదుర్కొంటున్న ఒడిదుడుకులను వివరించారు. గత 20 సంవత్సరాలుగా క్రమం





తప్పకుండా పత్రిక వెలువడటానికి సహకరిస్తున్న కార్టూనిస్టులు, రచయితలు, పోటీల నిర్వాహకులతో సహా అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియ జేశారు. పురుషుల విజయానికి మహిళలే పునాదిగా నిలుస్తారని అన్నారు. ప్రచురణరంగంలో ఈ స్థాయికి ఎదగిన తాను ఈ రంగంలో సేవలు చేస్తున్న మహిళలకు ఈ పురస్కారాన్ని అందిస్తూ... 32 ఏళ్ళుగా ప్రచురణకర్తగా సాహితీసేవ చేస్తున్న **శ్రీమతి గుత్తికొండ లక్ష్మిగారికి** ఈ ఏడాది బంగార్తల్లి పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

**శ్రీమతి గుత్తికొండ లక్ష్మిగారికి,** పదివేల రూపాయలు, జ్ఞాపిక, సన్మాన పత్రం, శాలువతో సత్కరించి, **బంగార్తల్లి పురస్కారం** ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేసారు.



ముఖ్య అతిథిగా హాజరైన ఆకాశ వాణి విజయవాడ కేంద్రం విశ్రాంత సంచాలకులు శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ–

“అమ్మ గురించి పరిపూర్ణంగా చెప్పగలిగిన సామర్థ్యం అమ్మకు మాత్రమే ఉంటుందన్నారు. అమ్మ ప్రేమను పొందగలగడాన్ని మించిన వరం మరొకటి లేదన్నారు. అమ్మ ప్రేమను తలచుకుంటూ, ఆమె పేరు మీద పురస్కారాలు అందిస్తున్న రాముగారిని ప్రశంసించారు. ఉత్తమ ఆశయం, క్రమశిక్షణ, సేవాభావం కలగలిసిన వ్యక్తిగా రాముగారిని ఆమె ప్రశంసించారు.

ప్రముఖ కవి, కార్టూనిస్టు, రచయిత, కళారత్న పురస్కార గ్రహీత శ్రీ బ్నిం మాట్లాడుతూ– “కళాకారులకు, కార్టూనిస్టులకు హాస్యానందం ఉత్తమవేదికగా నిలుస్తుందన్నారు. ప్రతి కళాకారుడికి అండగా తాను ఉన్నాను అంటూ ముందడుగు వేసే మొదటి వ్యక్తి రాముగార”ని ప్రశంసించారు.

ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెంట్ డాక్టర్ కే.ఎన్.రావు మాట్లాడుతూ– “హాస్యం మనిషిని అనుక్షణం ఆనందంగా ఉంచుతుంద”న్నారు.

ప్రముఖ వైద్యులు, డాక్టర్స్ స్మైల్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ వి.వి రామకుమార్ మాట్లాడుతూ– సాధారణ మందులు నయం చేయలేని ఎన్నో వ్యాధులను చక్కటి చిరునవ్వు నయం చేస్తుందన్నారు. మనసారా నవ్వితే కలిగే ప్రయోజనాల మీద అంతర్జాతీయంగా ఎన్నో పరిశోధనలు జరిగాయని, ఆ పరిశోధనలన్నీ చక్కటి నవ్వుకే ఓటు వేసాయన్నారు.

శ్రీదండెంరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.ఎన్.వి. రామశర్మ మాట్లాడుతూ– హాస్యం మనిషిని మంచి వ్యక్తిగా మారుస్తుంది అన్నారు. ఈ హాస్య కథల పోటీకి సుమారు 220 కథలు వచ్చాయని, ప్రతి కథని తాను చదివానని, కొన్ని కథల్లోని హాస్యం తనను పొట్ట చెక్కలయ్యేలా నవ్వించిందని చెప్పారు.

కళాపోషకులు శ్రీ కె.వి.వి.సత్యనారాయణ, ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ ఏవీఎం తమ అభినందనలు తెలియజేశారు.

అనంతరం శ్రీదండెంరాజు ఫౌండేషన్ సౌజన్యంతో ‘అమ్మాయి నవ్వితే’ అనే అంశంపై నిర్వహించిన హాస్య కథల పోటీల విజేతలకు, నార్త్ కోస్టల్ ఆంధ్ర కార్టూనిస్టుల ఫోరమ్ (NCCF) విశాఖపట్నం వారు నిర్వహించిన కార్టూన్ పోటీల విజేతలకు బహుమతులు అందించారు.

ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ పాలక మండలి సభ్యులు **డాక్టర్ కప్పగంతు రామకృష్ణగారు** సభని ఆద్యాంతం ఆహ్లాదంగా నిర్వహించారు.

హాస్యానందం ఏర్పాటు చేసిన కమ్మనైన విందు భోజనంతో కార్యక్రమం తృప్తిగా ముగిసింది.

**–ఆర్కే**




ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.

డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ పాలక మండలి సభ్యులు*
90320 44115

**(గత సంచిక తరువాయి)**

**"**నిజానికి, సదరు రచయిత ఎంత గొప్పవాడైనా 'ఉద్దండుడు' మాత్రమే కాగలడు. ఎందుకంటే, 'ఉద్ధండుడు' అనేది తప్పు పదం. అంత గొప్ప వాడి గురించి ఘనంగా చెప్పాలనే ఆవేశంలో 'ఒత్తు' పెడితే 'తప్పు'లో కాలెయ్యక తప్పదు మరి..." అంటూ ఆవేశం ఆపుకోలేక, పక్క కుర్చీలో కూర్చున్న పెద్దమనిషితో అనేసా!

"మాస్టారూ... మీరు మరో మాట మాట్లాడ నంటేనే సభలో ఉంటా... లేదంటే... ఈ క్షణమే వెళ్ళి పోతాన"ంటూ సదరు పెద్ద మనిషి నిక్కచ్చిగా చెప్పేసరికి, సభ పూర్తయ్యే వరకు చేతికి తప్ప నోటికి పని చెప్పలేదు.

ఆ రోజు నాకు బాగా గుర్తుంది.

ఐదవ్వగానే ఇంటికి చేరుకుని... మా పెరట్లో విశ్రాంతిగా అలా వాలుకుర్చీలో కూర్చుని, కళ్ళు మూసుకున్నా.

పక్కనే నా ఇల్లాలు తోటపని చేస్తోంది.

ఇంతలో ఏమయ్యిందో ఏమిటో... నా శ్రీమతి–

"ఏమండీ...! అంటూ పొలికేక పెట్టింది.

ఉలిక్కిపడి లేచి ఆమె దగ్గరకు పరిగెత్తా, విష పురుగేమైనా కుట్టిందేమో అని గాభరా పడుతూ.


"ఇలా చూడండి!... మన గులాబీ మొక్కకు పూలు పూసాయి. వాసన 'గుభాళిస్తోంది' అంటూ పసిపాప బుగ్గలు సుతారంగా నిమురుతున్నట్లు మొగ్గలను చేతిలోకి తీసు కుంటూ ఆమె సిగ్గుల మొగ్గ అవుతోంది.

కోపం కట్టలు తెంచుకున్నా తాళి కట్టిన విషయం వెంటనే గుర్తుకు రావడంతో నన్ను నేనే సముదాయించుకున్నా... అయినా సహజం లక్షణం ఆగదు కదా... ఎంత బాగా వాసన వచ్చినా అది **'గుభాళింపు'** కాదే **'గుబాళింపు'** మాత్రమే అనే సరికి శ్రీమతి చిన్నబుచ్చుకుంది.

"ఓ ముద్దూ లేదు... ముచ్చటా లేదు. ప్రతి దాంట్లో ఒత్తులు, దీర్ఘాలూ అంటూ తప్పులు వెతకటం తప్ప! పెళ్ళాంతో నాలుగు సరదా మాటలు మాట్లాడం తెలియదు. అసలు మిమ్మల్ని అని ఏం లాభం... తెలుగు పంతులు ఉద్యోగం చేస్తున్నాడు అన్నప్పుడే మా నాన్నకు ఈ సంబంధం వద్దని చెప్పా. నిక్షేపంగా ఐటి ఉద్యోగం చేస్తున్న బెంగళూరు సంబంధం కాదని... ఉన్న ఊళ్ళో సంబంధం అంటూ ఈ తెలుగు పంతులు సంబంధం ఖాయం చేసారు. నా మాట వింటేగా! అయినా... ఇప్పుడను కుని ఏం లాభం!"... అంటూ రుసరుసలాడుతూ లోపలికి వెళ్ళి పోయింది.

ఇంతకీ నేనేం తప్పు మాట్లాడానో అర్థం కావటం లేదు... చిన్న మెదడు పని చెయ్యటం మానేసిందేమో మరి.

ఏం జరుగుతోందో అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తూ, అలాగే




వాలుకుర్చీలో జారిగిలాపడ్డా. క్రమంగా వెలుగు తగ్గి, చీకటి కమ్ము కుంటోంది. పిచ్చి పిచ్చి ఆలోచనలతో నా బుర్ర పనిచెయ్యటం మానే సింది. పెరట్లో మొక్కల మీదుగా వీస్తున్న స్వచ్ఛమైన గాలికి, మనసు సేద దీరుతోంది. ఆ హాయి క్రమంగా నిద్రకు దారితీసింది.

నాకు తెలియకుండా కళ్ళు మూతలుపడ్డాయి.

ఇంతలో గోడవారగా, ఏవో గుసగుసలు వినిపించడంతో నెమ్మదిగా కళ్ళు తెరచి ఈ లోకంలోకి వచ్చాను.

ఆడ, మగ గొంతుకలతో మాటలు విని పిస్తున్నాయి. పరాయి వాళ్ళు మాట్లాడుకుంటు న్నప్పుడు వినటం సభ్యత కాదని తెలిసినా, రాత్రివేళ మా గోడ వైపు గుసగుసలు వినిపిం చడంతో, ఏం జరుగుతోందో తెలుసుకుందా మని, పిల్లిలా అడుగులు వేస్తూ, మాటలు విని పిస్తున్న వైపునకు నడిచాను.

“మల్లీ! నీ ప్రాణానికి నా ప్రాణం ఫణంగా పెడతాను. నన్ను నమ్ము. రేపు సరిగ్గా ఇదే సమయానికి వచ్చేయి. ఇద్దరం కలిసి ఎక్కడి కైనా వెళ్ళి, పెళ్ళి చేసుకుందాం!” అంటూ ఎంతో అనునయంగా తన ప్రేయసి చేతిలో చెయ్యేసి చెబుతున్నాడో ప్రేమికుడు.

ఊళ్ళో ఈ జంటను ఎప్పుడూ చూసిన జ్ఞాపకం రావటం లేదు. అయినా, ఉండబట్ట లేక బయటకే అనేసా.... “అమ్మాయ్! వాడి మాట నమ్మి మోసపోకు. వాడు నిన్ను ప్రేమిం చడం లేదు. నీ కోసం వాడి ప్రాణాన్ని ఫణంగా పెడతాను అంటున్నాడు. ఫణము అంటే పాము పడగ. అంటే, నువ్వు పాము పడగలోకి చేరబోతున్నావు. జాగ్రత్త తల్లీ... అంటూ కన్న బిడ్డలాంటి అమ్మాయికి నచ్చజెప్పే ప్రయత్నం చేసాను.

నా మాట పూర్తయిందో లేదో, మరో మాట లేకుండా కాలికి బుద్ధి చెప్పాడా ప్రేమికుడు.

ప్రాణం ఇస్తానన్న మనిషి, ఒక్క మాటకే పరుగు లంకించుకోవడంతో, ఏం చెయ్యాలో తెలియక, ఏం జరుగుతోందో అర్థం కాక, బిత్తరచూపులు చూస్తూ నిలబడిందా పిల్ల.

“చూడమ్మా! రాత్రి వేళ ఇలా రావటం తప్పు కదా! నీ తల్లిదండ్రులు నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకుంటారు కదా! చదువుకున్న అమ్మా యిలా ఉన్నావు. పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టి, ఇంటికి వెళ్ళమ్మా!...” అంటూ సుద్దులు చెప్పాను. అయినా, ఏదో ధర్మసందేహం ఆ అమ్మాయిని పట్టిపీడిస్తోందని అర్థమై, “నీ సందేహం ఏమిటమ్మా”... అడుగు అన్నాను.

“ఫణం అంటే పాము పడగ అన్నారు కదా మాస్టారూ... మరి ఆ సందర్భంలో ఏం అనాలి

**గమనిక:**
తెలుగు భాషాభిమానులకు వందనాలు! మనం నిత్యజీవితంలో తెలుగులో అలవాటుగా మాట్లాడే కొన్ని పొరపాటు మాటలు వింటుంటాం. ఆ **పొరపాటు** ఏదో? దానికి **సరైన మాట** ఏదో మీరు రాసి పంపిస్తే ప్రతి నెలా హాస్యానందంలో మీ పేరుతో ప్రచురిస్తాం. **-సం॥**

అని అడిగింది.

ఆ క్షణంలో అరికాలి మంట నెత్తికెక్కింది నాకు. కన్నకూతురుగా భావించి... మంచి మాటలు చెబుతుంటే తప్పొప్పులు అడుగు తుందా? ఆయ్... అసలేమనుకుంటోంది నా గురించి?! అనిపించినా... నా తెలుగును

ఎప్పటిలాగే రోజులు గడుస్తున్నాయి.

సాయంత్రం బడికాగానే, అలా నడుచు కుంటూ ఇంటి వస్తుంటే, దారితో పూర్వ విద్యార్థి కనిపించి, నమస్కారం చేసాడు.


కుశలప్రశ్నలు అయ్యాక, “మాస్టారూ! నా సంస్థలో పనిచేసే కార్మికుల పిల్లలకు పోటీలు పెట్టాను. రాబోయే ఆదివారం సాయంత్రం బహుమతి ప్రధాన సభ పెట్టాను. మీరు అతిథిగా రావాలండీ!” అన్నాడు.

“రానంటే రాను! అవును... రానంటే రాను!!” అంటూ నిక్కచ్చిగా చెప్పేసా.

నిజం చెప్పొద్దూ... గట్టిగా అరిచేసా!

హఠాత్పరిణామానికి బిత్తరపోయాడా పూర్వ విద్యార్థి. అర్థం కాని హావభావాలన్నీ ముఖంలో పలికించాడు.

“**ప్రధానం** అంటే ముఖ్యమైనది అని అర్థం.




**‘అమ్మనుడిని అటకెక్కిస్తారా!’ సౌజన్యంతో**

గుర్తించినందుకు కించిత్ గర్వంగా కూడా అని పించింది. **ఫణము** అంటే పాము పడగ, **పణము** అంటే పందెము అని అర్థం అమ్మాయ్ అంటూ పాఠం చెప్పేసా... ఇన్నాళ్ళకు నా తెలుగును గుర్తించిన ఓ ప్రాణి కనబడిందన్న ఆనందంతో.

చివరకు గోడలకు పాఠాలు చెప్పే దశకు చేరుకుంది మీ తెలుగు తిక్క. ఇక లోపలికి వస్తే, అందరం కలిసి భోజనం చేద్దాం అంటూ మా ఆవిడ అరిచే సరికి, మారుమాట్లాడ కుండా లోపలికి నడిచాను.

✦✦✦

**ప్రదానం** అంటే ఇవ్వటం అని అర్థం. బహు మతి ప్రదానం అనాలి కానీ ప్రధానం అన కూడదు” అంటూ నడిరోడ్డు మీదే క్లాసు చెప్పే (పీకే) సరికి, మళ్ళీ కలుస్తాను మాస్టారూ... కార్యక్రమం వాయిదా పడే అవకాశం ఉంది. తేదీ ఖరారు కాగానే కబురు చేస్తానంటూ సెకనులో మాయమయ్యాడు.

✦✦✦

ఆ రోజు ఆదివారం కావడంతో ఇంట్లోనే ఉన్నా. మా పెద్దనాన్నగారి అబ్బాయి శివాజీ దంపతులు వచ్చారు. **(వాళ్ళతో మాస్టారుగారి అనుభవం వచ్చే సంచికలో తెలుసుకుందాం!)**




# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## రోల్‌మాడల్

"ఏమండీ... నేనెళ్ళి మేడ మీద ఆరేసిన బట్టలు తీసుకుని వస్తాను... ఈ లోగా ఉల్లి పాయలు కాస్త తరిగేస్తారా?!" అని రమ్య తన భర్త ప్రకాష్‌తో అంది.

"నాకు పనుంది!... తర్వాత వచ్చి నువ్వే తరుక్కో!" అన్నాడు ప్రకాష్ నిర్లక్ష్యంగా... మొబైల్లో వాట్సప్ చూసుకుంటూ.




అక్కడే వున్న వాళ్ళ ఇరవై రెండేళ్ళ కూతురు సుమన– 'ఏంటీ డాడీలో ఈ సడెన్ ఛేంజ్?... ఎలాంటి ఇగో లేకుండా మమ్మీకి ఇంటి పనీ, వంటపనీ అనే కాకుండా, అన్ని పనుల్లో సాయం చేసేవాడు. ఓ రకంగా చెప్పాలంటే... అన్నీ పనులూ డాడీ చేస్తుంటే మమ్మీ అప్పుడప్పుడూ హెల్ప్ చేసేది... కానీ కొన్ని రోజులుగా డాడీ ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడో... అడగాల'నుకుని అడిగేసింది.

"లేదమ్మా! ఇన్నాళ్ళూ మనసు చంపుకుని మీ మమ్మీకి హెల్ప్ చేశాను... ఇకనుండి చేయకూడదని డిసైడ్ చేసుకున్నాను!" అని సిగరెట్ వెలిగించాడు.

ఎప్పుడూ సిగరెట్ తాగని తన నాన్న కేసి ఆశ్చర్యంగా చూస్తూ–

"అదేంటీ డాడీ!... మమ్మీకి హెల్ప్ చేస్తే తప్పా?" అడిగించి సుమన.

"తప్పో, ఒప్పో నాకు తెల్దు... నేనూ అందరి లాంటి మగాడ్నే... వంట పనీ ఇంటిపనీ అనేది ఆడదే చేయాలి దట్సిట్!" అని సగం కాలిన సిగరెట్ ని ఓ మూలకి వేసిరేశాడు.

"సారీ డాడీ!... మీరు ఇలాంటి వారు అనుకోలేదు. ఇన్నాళ్ళూ మీరే నా రోల్ మోడలనుకున్నాను. కానీ... ఈ రోజునుండి నా అభిప్రాయాన్ని మార్చుకుంటున్నా!" అని కోపంగా అక్కడినుండి వెళ్ళిపోయింది సుమన.

ప్రకాష్‌లో ఈ మార్పు రావడానికి కారణం అయన ఫ్రెండ్ మోహన్.

✦✦✦

వారం క్రితం పార్క్‌లో కూర్చోని వున్న మోహన్ డల్‌గా కనిపించడంతో కారణం అడిగాడు ప్రకాష్.

"నేను సిగరెట్లు తాగను... మందు ముట్టుకోను... అందరూ నాలాగే ఉండాలంటే ఎలా కుదురుతుంది?" అన్నాడు మోహన్ అసలు విషయం చెప్పకుండా.

"దానివల్ల నీకొచ్చిన సమస్య ఏంట?!" అడిగాడు ప్రకాష్.

"మానాన్నకే మందూ, సిగరెట్లు తాగే పాడు అలవాట్లు లేవు. వాటిని మానుకో!" అని మా అల్లుడుతో నా కూతురు అందట.

దానికి మా అల్లుడు– "అందరూ మీ నాన్న లాగా వుండాలనుకోకు! నాకంటూ కొన్ని అలవాట్లు వున్నాయి. వాటిని ఎవరి కోసమో నేను మానుకోను!" అని అన్నాట్ట.


"దాంతో ద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఆ కోపంలో మా అల్లుడు నన్నేదో అన్నాట్ట... 'జంటిల్ మెన్ లాంటి మా నాన్నని పట్టుకుని అంత మాట అంటావా?.. నువ్వెంతా నీ బతుకెంతా! లైఫ్‌లో నీ మొహం చూడను!" అని లగేజీ సర్దుకుని ఇంటికొచ్చేసింది....

నా కూతురికి నేనే రోల్ మోడల్. అందరూ నాలాగే మందూ, సిగరెట్లు తాగకుండా వుండాలని కోరుకుంటుంది. ఈ రోజుల్లో ఇది ఎలా కుదురుతుంది?... అందరూ నాలా ఎందుకుంటారు? నా మంచితనం, నా ప్రవర్తనే నా కూతురి కాపురం కూల్చింది!..." అని బాధ పడుతూ చెప్పాడు మోహన్.

దీంతో ప్రకాష్ ఆలోచనలో పడ్డాడు.

తనకీ మందూ సిగరెట్లు తాగే అలవాటు లేదు. పైగా తన భార్య చేసే అన్ని పనుల్లో తను హెల్ప్ చేస్తూ ఉంటాడు. ముఖ్యంగా తన కూతురికి తనే రోల్ మోడల్.

రేపు సుమ నాకు పెళ్లి అయ్యాక, అల్లుడుకి మందూ సిగరెట్లు తాగే అలవాట్లు వుంటే ?.. వంట పని ఇంటిపనిలో సుమన నాకు హెల్ప్ చేయకపోతే? తనతో కంపేర్ చేసుకుని 'మా డాడీ అన్ని పనుల్లో మా మమ్మీకి... హెల్ప్ చేస్తాడు, నువ్వెందుకు చేయవు?' అని లాజిక్ లేవనెత్తితే? సుమన కాపురం గ్యారంటీగా కూలిపోతుంది.




అందుకే సుమన ఇంట్లో ఉన్నప్పుడు తన భార్య రమ్యకు వంట పనిలోగానీ ఇంటిపనిలో గానీ హెల్ప్ చేయకూడదననీ, అంతే కాకుండా మందూ సిగరెట్లు తాగుతున్నటు నటించాలని నిర్ణయించుకున్నాడు.

✦✦✦

"అంటే ఇకనుండి మీరు నాకు వంట పనిలో గానీ , ఇంటి పనీలో గానీ నాన్ కో ఆపరేషన్ మెయిన్‌టైన్ చేస్తారన్న మాట!?" తన ఒళ్లో పడుకుని వున్న ప్రకాష్‌ని గోముగా అడిగింది రమ్య.

"సుమన ఇంట్లో వున్నప్పుడు తప్పదు భార్యామణి!" అని రమ్య బుగ్గ గిల్లాడు ప్రకాష్.

"మీరు నాకు హెల్ప్ చేయకపోయినా ఫర్వా లేదు.. మన సుమన ద్రుష్టి లో విలన్ కాకుండా చూసుకోండి!" అంది రమ్య వస్తున్న నవ్వుని ఆపుకుంటూ.

"నేనిప్పుడు సుమనాకు విలన్‌లా కనిపించినా , రేపు పెళ్లి అయ్యాక తన భర్తకు మందూ సిగరెట్లు తాగే అలవాట్లు వుండీ, వంట పనీ, ఇంటిపనిలో హెల్ప్ చేయకపోయినా... అందరు మగాళ్ళు ఒకటే అనుకుని సర్దుకుపోతుంది!" అని తన సైకాలజికల్ ఎనాలసిస్‌ని చెప్తూ రమ్యను దగ్గరకు తీసుకున్నాడు ప్రకాష్.





# ముళ్లపూడి సింగిల్‌పేజీ హాస్యకథల పోటీ

ప్రఖ్యాత రచయిత ముళ్లపూడి వెంకటరమణగారి
పుట్టిన్రోజు జూన్,28 సందర్భంగా

**సింగిల్ పేజీ హాస్య కథల పోటీ**

హాస్యానందం నిర్వహిస్తోంది.



శ్రీ ఏ.వి.కృష్ణమూర్తి, సికింద్రాబాదు గారు
సమర్పిస్తున్న ఈ పోటీలో అందరూ పాల్గొని
విజయవంతం చేయాలని కోరుతున్నాం!

## పది కథలకు వెయ్యి రూపాయలు చొప్పున పది బహుమతులు

**నిబంధనలు:**

- మీ కథలు రాత ప్రతిలో రెండు పేజీలకు మించకూడదు
- తెలుగుతనం ఉట్టిపడేలా కథలు ఉండాలి
- కొసమెరుపుకి ప్రాధాన్యం!

**కథలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ మే 10,2023.**

కథలు ఈ మెయిల్‌కి పంపండి-

**hasyanandampoteelu@gmail.com**

# చందమామపై హనీమూన్



పి.ఎన్.బి.యస్.శ్రీనివాస్,
9989646639

**అదొక పెద్ద కార్పొరేట్ ఆఫీస్...**

**క్యాబిన్‌లో అటుఇటు తిరుగుతూ ఉంది ప్రియ!**

**టైం ఉదయం 10 గంటల 30 నిమిషాలు... కార్పొరేట్ లుక్లో తయారై క్యాబిన్‌లో అలా తిరుగుతూ ఉంది.**

ప్రియా టీనేజ్ గర్ల్... ఎంసీఏ చదువుతుంది... హైట్‌కి తగ్గ పర్సనాలిటీ... మంచి కలర్. అచ్చం ఇంగ్లీష్ సినిమాలోని హీరోయిన్‌లా ఉంటుంది. చలాకీతనంలో ఫస్ట్... ఇంట్లో అమ్మను అన్నయ్యను ఆట పట్టించే అల్లరిలో బెస్ట్. పైగా నాన్న కూచి. తనకంటూ ఎన్నో కోరికలు ఉన్నాయి. వాటిలో కొన్ని ఎదుటివారిని ఆశ్చర్యపరుస్తాయి కూడా!

టేబుల్‌పై సెల్ ఫోన్ లో రింగ్ టోన్ మొదలయింది. దాని వంక చూసే సరికి తండ్రి పిక్ కనిపించింది.

వెంటనే లిఫ్ట్ చేసి– "హలో.. డాడీ!" అంది..

"ఏరా ప్రియా! వచ్చారా?!" అన్నాడు అటునుండి తండ్రి.

"వచ్చారు డాడీ! మీటింగ్ రూమ్‌లో ఉన్నారు!" అంది ప్రియ సమాధానంగా.

"మరి ఇంకెందుకు ఆలస్యం! ఇంటర్వ్యూ మొదలుపెట్టు!" అంటూ ఆర్డర్ వేశాడు తండ్రి.

"అదే నేను ప్రిపేర్ అవుతున్నాను... పిలుస్తాను!" అంది ప్రియ.

"ఆల్ ద బెస్ట్ రా ప్రియా నాయుడు!" అన్నాడు తండ్రి.

"థాంక్యూ డాడీ..!! ఇంటర్వ్యూ ఫినిష్ చేసి రిజల్ట్ చెప్తాను!" అంటూ సెల్ స్విచాఫ్ చేసింది ప్రియ.

'టంగ్.. టంగ్...' అంటూ కీ బెల్ మోగించేసరికి...

"ఎస్.. మేడమ్! చెప్పండి!" అంటూ వచ్చాడు ఆఫీస్ బాయ్.

"చూడు! మీటింగ్ హాల్లో ఉన్న ముగ్గురిలో ఒకరిని నా క్యాబినెట్‌కు తీసుకురా!" అంటూ ఆర్డర్ వేసింది ప్రియ.

"ఓకే మేడం!" అంటూ వెళ్ళాడు బాయ్.

కాసేపట్లో మంచి హైట్, పర్సనాలిటీ ఉన్న వ్యక్తి ప్రియ క్యాబిన్ లోనికి వచ్చాడు.

"ప్లీజ్ బి సీటెడ్!" అంటూ తనకు ఎదురుగా ఉన్న సీటు చూపించింది.

"థాంక్యూ!" అంటూ కూర్చున్నాడు ఆ అబ్బాయి.

"మీ పేరు..?!" అంది అతని వంక తదేకంగా చూస్తూ.

"సంతోష్!" అన్నాడు అతను జవాబుగా.

"ఓకే మిస్టర్ సంతోష్! మీరు నన్ను పెళ్లి చేసుకోవాలని ఎందుకు అనుకుంటున్నారు?" అని అడిగింది.

"మీ అందం నచ్చి!" అంతే స్పీడ్‌గా జవాబిచ్చాడు సంతోష్.

"ఓc! అంటే... కేవలం నా అందాన్ని మాత్రమే ప్రేమించి... ఇష్టపడి ఈ పెళ్ళికి రెడీ అవుతున్నారు అన్నమాట!..." నొక్కి నొక్కి పలికింది సీట్‌లో నుండి పైకి లేచి!


"ఎస్! మిస్ ప్రియా!!" అన్నాడు అతను కూడా

"నో! ఐ యామ్ నాట్ ప్రియ... ప్రియా నాయుడు!" తలఎగరేస్తూ... "నౌ యూ కెన్ గో!" అంది.

అతడు స్పీడ్‌గా క్యాబిన్ నుండి బయటకు వెళ్ళిపోయాడు.

మళ్లీ బెల్ మోగేసరికి ఆఫీస్ బాయ్ రెండో వ్యక్తిని ఎంటర్ చేశాడు.

"ప్లీజ్ బి సిటెడ్!" అంది అతన్ని చూస్తూ.




"థాంక్యూ!" అంటూ కూర్చున్నాడు అతడు. తను మాత్రం అటు ఇటు తిరుగుతూ చేతిలో పెన్ గుండ్రంగా తిప్పుతూ అతన్ని చూస్తుంది. మొదటి ప్రశ్న కోసం అతడు ధీమాగా ఎదురు చూస్తూ కనిపించాడు.

"మీ పేరు..?!" ప్రశ్నించింది.

అతడు దానికి "ప్రొఫైల్ ఇచ్చాను కదా చూడ లేదా?!" అన్నాడు.

"చూసాను! కాకపోతే ఫార్మాలిటీగా అడిగాను!" అంది ప్రియ.

"ఓకే!... నా పేరు రిషి!" అన్నాడు కాస్త పొగరుగానే.

"చూడండి మిస్టర్ రిషి! నా పై మీ అభిప్రాయం?" అడిగింది ప్రియ.

"అందంతో పాటు... కాస్త పొగరు ఉన్న అమ్మాయి!" అన్నాడు ధీమాగా.

"అయితే... నన్ను ఎందుకు పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నారు?" అడిగింది ప్రియ.

"ఏముంది? నాకూ పొగరు ఉంది! నీకూ పొగరు ఉంది. ఇద్దరికీ అందం ఉంది. సో... మేడ్ ఫర్ ఈచ్ అదర్ అంతే!" సింపుల్‌గా చెప్పాడు అతను.

"ఓ అలాగా!... ఇట్స్ ఆల్ రైట్ యు కెన్ గో!" అంది ప్రియ

చివరి వ్యక్తి క్యాబిన్ లోనికి వచ్చాడు.

సేమ్ ట్రీట్‌మెంట్ మొదలెట్టింది ప్రియ.

"చూడు మిస్టర్ రాంబాబు! నీ పేరు నీకు నచ్చిందా?" అడిగింది ప్రియ.

"నాకు నచ్చక ముందే మా అమ్మానాన్నలు నాకు ఈ పేరు పెట్టారు... కాబట్టి నాకు నచ్చింది!" అన్నాడు అతను.

"నన్ను పెళ్లి చేసుకుంటే నాకు ఒక కోరిక ఉంది తెలుసా!" అడిగింది.

"ఏమిటో చెప్పండి!" అన్నాడతను కూల్‌గా.

"హనీమూన్ చందమామపై చేసుకోవాలని కోరిక. ఏమంటావు?!" కళ్ళు ఎగరేస్తూ అంది.

"ఓస్ అంతేనా! చాలా ఈజీ తప్పకుండా!" అన్నాడు అతడు బెదరకుండా.

"హేయ్!!... నేనన్నది చందమామ మీద అని!" మళ్లీ నొక్కానించి పలికింది.

"నువ్వు అన్నది నాకు అర్థం అయింది... అది చాలా తేలిక!" అన్నాడు అతడు మళ్ళీ ధీమాగా ప్రియను ఆశ్చర్యపరుస్తూ.


"ఎలాగో చెప్పగలవా?" కుతూహలంగా అడిగింది ప్రియ.

"ఆ కోరిక నీకే కాదు నాకూ ఉంది... కానీ అది నా భాగస్వామితోనే చెప్పాలన్నది నా నిర్ణయం కాబట్టి నీకు చెప్పలేను!" అన్నాడు అతను తెలివిగా.

వెంటనే ప్రియ యు ఆర్ సెలక్టెడ్!" అంది హుషారుగా.

✦✦✦






ముఖం మీద కాస్త నీళ్లు చిలకరించి గట్టిగా ఊపేసరికి బద్ధకం విరుచుకుంటూ–

"ఏంటమ్మా! అప్పుడే నిద్రలేపేసావు?" అని మెల్లగా కళ్ళు తెరిచింది మంచం మీద నుండి ప్రియ.

"లేపక ఏం చేయమంటావ్?! ఇప్పుడు టైం ఎంత అయిందో తెలుసా!" అంది తల్లి.

"ఎంతోకొంతలే... కరోనా టైమే కదా!... ఎందుకు పనికి రాదు. అయినా కాక పోయినా ఎందుకు లేపావ్! మంచి కల పాడుచేసావు!" అంది.

"నువ్వు ఇలా కలలు కంటూనే ఉండు అవతల పెళ్లి వారు వచ్చే టైం అయింది... లేచి త్వరగా రెడీ అవ్వు!" అంటూ ఒంటి మీద ఉన్న దుప్పటి లాగి మడత పెట్టింది తల్లి.

"పెళ్లివారా?!" ఆశ్చర్యపోతూ అడిగింది.

"హాc... పెళ్లివారే!... పెళ్లి కొడుకు పేరు రాంబాబు!" అంది తల్లి.

దెబ్బకి ఒక్కసారి మత్తు వదిలింది ప్రియకు.

"అయితే పెళ్లి చూపులు అక్కర్లేదు. డాడీని ఓకే చెప్పేయమను" అంది ప్రియ.

"అదేంటే నీకేమైనా పిచ్చా? చూడకుండానే ఓకే చెప్పేయ్‌మంటున్నావ్?" అంది తల్లి.

"అది అంతేలే!" అంటూ బాత్ రూంలోకి టవల్ తీసుకొని పరిగెత్తింది ప్రియా నాయుడు.

✦✦✦

ధూమ్ ధామ్‌గా పెళ్లి జరిగిపోయింది.

హనీమూన్ నైట్ రానే వచ్చింది.

ప్రియలో ఆత్రం... ఏం చెప్తాడా అని!.... డెకరేషన్ చేసిన కారులో ప్రియను తీసుకొని బయలుదేరాడు రాంబాబు.

తిన్నగా ఆ కారు వెళ్లి ఓ కాస్ట్‌లీ రెస్టారెంట్ ముందు ఆగింది.

శ్రీమతి ప్రియా నాయుడు గారు దిగండి! మనం చందమామ మీదకు వెళ్ళాలి అన్నాడు రాంబాబు.

"ఇక్కడా?... ఎక్కడా?!..." అడిగింది ప్రియ ఆశ్చర్యపోతూ.

"ఒక్కసారి అలా పైకి చూడండి!" అన్నాడు రాంబాబు.

ప్రియ రాంబాబు చూపిన వేలు వంక పైకి చూసింది–

చందమామ రెస్టారెంట్... అన్న పేరు మెరుస్తూ కనిపించింది.

అంతే! "దొంగసచ్చినోడా! నన్ను మోసం చేశావ్!..." అంటూ రాంబాబు హృదయంపై మెత్తని పిడిగుద్దులు గుద్దింది ప్రియానాయుడు సిగ్గుపడుతూ.

హాస్యానందం అభినందనలు Congratulations


## చెన్నై తెలుగు వెలుగు సంక్షేమ సంఘం ఉగాది పురస్కారాలు



చెన్నై తెలుగు వెలుగు సంక్షేమ సంఘం వారు ఉగాది సందర్భంగా మార్చి 12న ఏడుగురు బాల సాహితీవేత్తలకు తెలుగువెలుగు పురస్కారాలు అందించారు. ఆర్సీ కృష్ణస్వామి రాజు-తిరుపతి, డాక్టర్ గంగిశెట్టి శివకుమార్- నెల్లూరు, బెహరా ఉమామహేశ్వర రావు-పార్వతీపురం, సంగనభట్ల చిన్న రామకిష్టయ్య-ధర్మపురి, దార్ల బుజ్జిబాబు-చిలకలూరిపేట, యు.విజయశేఖర్ రెడ్డి- ప్రొద్దుటూరు, చెన్నూరి సుదర్శన్ - హుజురాబాద్- ఈ పురస్కారాలు అందుకున్నారు. సంఘ అధ్యక్షుడు అల్లిగం రాజశేఖర్ ఆధ్వర్యవంలో జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత డాక్టర్ బెల్లంకొండ నాగేశ్వరరావు, సాహితీ ప్రియులు గుడిమెట్ల చెన్నయ్య, పసుమర్తి బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# విచిత్రపోళ్ళు!


పొద్దుట్నుంచీ చూస్తున్నా, మీ ఊరి బస్సులెన్నొచ్చినా ఎక్కట్లేదేంటి?
బస్సు సర్వీసు నంబర్లన్నీ కూడితే పదకొండు రావాలి. అదొస్తేనే ఎక్కుతా! అది నా లక్కీ నంబర్.
BUS STA
RTC రిజర్వేషన్


చెట్టుగాలి నాకు పడదు మరి!


మర్డర్లు, రేప్‌లు, యాక్సిడెంట్లు, చావు వార్తలంటే ఎంతో ఇష్టం. ఏ రోజైనా పేపర్లో అలాంటి వార్తలు లేకపోతే ఇదిగో ఇలా చిర్రుబుర్రులాడి పోతారు!


తనకున్న అప్పుల బాధల నుండి విముక్తి చెయ్యమని అడిగాడు. ఇది విముక్తే కదా!...
!!?

# అయ్యో రామ(ం)!



నిమ్మగడ్డ కృష్ణ,
8105712574

**ఆ రోజు ఆదివారం సెలవు కావడంతో... త్వరగా లేచి ఆఫీస్ కి వెళ్ళక్కరలేదు కదా అని బారెడు పొద్దెక్కినా లేవకుండా గదిలో ముసుగు తన్ని పడుకున్నాడు రామం.**

**ఫోన్ మోగడంతో 'అబ్బా!... ఏవ్రా బాబు ఆదివారం కూడా హాయిగా నిద్ర పోనివకుండా?' అనుకుంటూ... ఫోన్ ఎత్తగానే – "ఒరేయ్ రామం! అర్జెంట్‌గా వాట్సాప్ చూడరా!" అని ఫోన్ పెట్టేసాడు స్నేహితుడు సంతోష్.**

కంగారుగా వాట్సాప్ తెరచి చూసిన రామానికి ఏవో ప్రశంసా పత్రాలు కనబడ్డాయి. వాట్సాప్ రచయితల, సాహిత్య గ్రూప్‌ల గురించి బొత్తిగా తెలియని రామం... వెంటనే స్నేహితుడికి ఫోన్ చేసి– "ఏంట్రా? నువ్వేదో పంపావు నాకు అర్థం కాలేదు!" అని అడిగాడు.

అప్పుడు "ఒరేయ్! అవి ప్రశంసాపత్రాలు రా! మనం రాసిన కవితలకు మెచ్చుకొని ఆయా సాహిత్య గ్రూప్‌ల వాళ్ళు మనకి ఇచ్చేవి... ఎలా ఉన్నాయి?" అని అడిగాడు.

వెంటనే రామం– "బాగున్నాయి!... కానీ నాకు కూడా ఇస్తారా?" అని అడిగాడు.

అప్పుడు సంతోష్– "ఇస్తారురా! కానీ..." అని నసుగుతుంటే...

"కొంపతీసి డబ్బులు కట్టాలా?" అని అడిగాడు రామం.

"లేదురా! డబ్బులేమీ కట్టక్కరలేదు... కానీ మనం ఆయా గ్రూప్‌లలో జాయిన్ అయ్యి కవిత్వం రాస్తే చాలు! నువ్వు రాస్తానంటే చెప్పు... నేను దాదాపు ముప్పయి గ్రూప్‌లలో ఉన్నాను!" అన్నాడు సంతోష్ సంతోషంగా.

అప్పుడు రామం– "నాకు కవిత్వం రాయడం రాదు కదరా?" అంటుంటే కల్పించుకున్న సంతోష్– "ఒరేయ్! చాలా మందికి తెలుగే సరిగ్గా రాదు! కవిత్వం తెలియదు అయినా రాస్తుంటారు! నువ్వేమి ఆలోచించకు నేనున్నాను కదా!" అని అభయం ఇచ్చి రామాన్ని అన్ని గ్రూప్‌లలో చేర్పించాడు.

బద్ధకాన్ని వదిలించుకొని లేచి బయటికి వెళ్లి కాఫీ తాగొచ్చి ఫోన్ తీసుకొని వాట్సాప్ తెరచి చూసిన రామానికి దాదాపు నూటఇరవై మెసేజులు దర్శనం ఇచ్చాయి.


అన్నీ సాహిత్య గ్రూప్ మెస్సేజులే.

ఆనందంతో మనసులోనే స్నేహితుడికి కృతజ్ఞతలు చెప్పుకొని ఒక గ్రూప్ ఓపెన్ చెయ్యగానే ఎవరో తనకు జరిగిన సన్మానం ఫోటోలు, జ్ఞాపికలు, అంటూ ఒక పది ఫోటోలు పెట్టాడు.

మరొక గ్రూప్ ఓపెన్ చెయ్యగానే తన కవితలు ఈ రోజు పేపర్లలో పడ్డాయంటూ పేపర్ క్లిప్పింగ్స్ పెట్టారేవరో, అవి చదువుతుంటే ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు, అయినా నాకెందుకులే అనుకుంటూ మరొక గ్రూప్ ఓపెన్ చేసాడు రామం. అందులో కొన్ని ఆడియోలు ఉన్నాయ్, మంచి సంగీతం అయ్యుండవచ్చు అనుకుని వింటున్న రామానికి పిచ్చెక్కిపోయింది ఎవరో పెద్దాయన కర్ణ కఠోరంగా పాడాడు ఇంకో రెండు మూడు ఆడియోలు ఉన్నాయ్. వామ్మో ఆ గొంతేంటిరా అయ్యబాబోయి అని అనుకుంటుండగా అప్పుడే ఎవరో ఆ పాటలని మెచ్చుకుంటూ సార్ చాలా అద్భుతంగా పాడారు. బాలసుబ్రమణ్యం పాడినట్టుగా ఉంది అని మెసేజి పెట్టారు. అది చూడగానే ఎవడు పాట పాడినా బాలసుబ్రమణ్యం అయిపోయి నట్టేనా? బాలుగారి లాగా ఎవ్వరు పాడలేరు. అంతే వీళ్ల వీళ్ళ పొగడ్తలు అనుకుంటూ మరొక గ్రూప్ ఓపెన్ చేసిన రామానికి అక్కడ ఒకతను అలలతో సెల్ఫీ అంటూ ఒక ఫోటో పోస్ట్ చేసి ప్లీజ్ ఎలా ఉందో చెప్పండి అని పెట్టాడు.

వీళ్ళ సెల్ఫీ పిచ్చి తగలెయ్య! అలలతో సెల్ఫీ ఏంట్రా? ఆ అల ముందుకొచ్చిందంటే ఇక నువ్వు జల సమాధేరా అనుకుంటూ వేరే గ్రూప్ ఓపెన్ చేసాడు రామం.

అందులో... ఓ పది యూ ట్యూబులు ఉన్నాయి... వాటి కింద ప్లీజ్ సబ్‌స్క్రైబ్ మై ఛానల్... లైకిట్... షేర్... ప్లీజ్! ప్లీజ్!! అని వ్రాసారేవరో.



అది చూడగానే ఏమి తెలివి వీళ్లది? ఫ్రీగా పబ్లిసిటీ చేసుకుంటున్నారు... అనుకుంటుం డగానే ప్రకృతి నుండి  పిలుపు రావడంతో ఫోన్ పక్కన పెట్టి బాత్రూంలో దూరాడు రామం.

స్నానాదికాలు ముగించుకొని మరల ఫోన్ చూడగానే ఈసారి నూట యాభై మెస్సేజులు దాకా  ఉన్నాయి.

వాటిలో కొన్ని ఫోటోలు/ ప్రశంసాపత్రాలు కనబడ్డాయి. ఈ ఫోటోలు ఎక్కడో చూసినట్టు ఉందే అన్ని ఆలోచిస్తుండగా అప్పుడు గుర్తుకు వచ్చింది.

మొట్టమొదటి గ్రూప్‌లో ఎవరో పోస్ట్ చేసారు అని. అంటే మొదటి గ్రూప్‌లోని వ్యక్తి ఈ అన్ని గ్రూప్‌లలో ఉన్నాడన్నమాట. అన్ని గ్రూప్‌లలో తన ఫోటోలు/ప్రశంసాపత్రాలు పెట్టాడు.

మరో గమ్మత్తయిన గ్రూప్‌లో కథల పోటీ, కవితల పోటీ నిర్వహించి, వాటి ఫలితాలు ప్రకటించారు. ఇంతవరకు వినని నామధేయులు బహుమతులు గెలుచు కున్నారు. ఆ బహుమతులు గెలుచుకున్న వాళ్ళలో ఒకరు – "ఆహాఁ! మీలాంటి వాళ్ళ వల్లే ఈ రోజు సాహిత్యం ఊపిరి పీల్చు కుంటుంది" అంటే..

"సముద్రంలో మునిగిపోతున్న సాహిత్యం మునిగిపోకుండా ఈతకొడుతుందంటే మీరే




కారణం!' అని మరొకరు... పొగడ్తలతో ఓ నలభై నాలుగు మెసేజ్‌లు.

'ఈ రోజు ఆదివారం అయింది కాబట్టి సరిపోయింది... అదే వర్కింగ్ డే అయ్యుంటే ఇవన్నీ చదవాలంటే శలవు పెట్టాల్సిందే! వామ్మో! ఇంతమంది వీటికోసం విలువైన తమ సమయం వెచ్చిస్తున్నారా?' అనుకుంటూ ఒకింత ఖంగారు కూడా పడ్డాడు రామం!

మరో గ్రూపులో తమ వీధి చివర ఉన్న సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలో గెలుచుకున్న ప్రశంసాపత్రం పెట్టారు ఓ మహిళామణి.

'బాబోయ్! పగవాడికి కూడా ఇట్లాంటి కష్టం రాకూడదురా బాబు!







ఇలా హింసిస్తున్నారేంటిరా బాబు! జనాలు ఏమైపోయినా పర్వాలేదు తమ గొప్ప చెప్పుకోవాలనే ఇటువంటి వారి చేతిలో ఫోన్, దానికి ఇంటర్నెట్ కనెక్షను లేకుండా చెయ్యి స్వామి!' అని దేవుడిని ప్రార్థిస్తూ...

'నువ్వు అలా చేస్తే అయినా, ఒకటో రెండో ఫోటోలు పెట్టకుండా ఇలా చాలా ఫోటోలు పెట్టి అందరికి ఇబ్బంది కలిగేలా ప్రవర్తించే వీళ్ళు అప్పుడైనా మారుతారేమో... ' అని తిట్టుకుంటూ వేరే గ్రూప్ తెరిచి చూసిన రామానికి అక్కడ ఒక ముప్పయి ధన్యవాదాల కామెంట్లు ఉన్నాయి.

మునుపు ఈ పెద్దమనిషి రాసిన కవితని బాగుంది అని తనను ప్రశంసించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెబుతున్న మెస్సేజులు అవి. ప్రతి ఒక్కరికి విడి విడిగా ఎందుకు చెప్పడం? ఒక్కసారి ఒక్క మెస్సేజులో ధన్యవాదాలు చెబితే సరిపోతుంది కదా? ఈ పెద్ద మనిషి.

స్మార్ట్ ఫోన్‌లు వాడుతున్న వీళ్ళు ఎప్పుడు స్మార్ట్‌గా ఆలోచిస్తారో!" అనుకుంటూ మరో గ్రూప్‌లోకి తొంగి చూసాడు రామం.

అందులో ఒకతను- అతను రాసిన కథ ప్రచురించిన వెబ్‌పేజీ పెట్టాడు. 'ఈ కథ చదవి మీ అమూల్యమైన అభిప్రాయం చెప్పండి' అని పెట్టాడు! అంతే! అందులో సభ్యులు ఇంచుమించు అందరూ ఒకో కామెంట్ పెట్టారు.

'వామ్మో! ఇదేం ఖర్మరా బాబూ!' అనుకుంటూ సమయం చూసాడు. సాయంత్రం నాలుగు గంటలు కావొస్తుంది అయ్యో ఈపాటికి మెస్సు కూడా మూసేసి ఉంటారు. ఈ గ్రూప్‌లలో పడి భోజనం చెయ్యడం కూడా మర్చిపోయాను కదా?

ఎందుకొచ్చిన ప్రశంసాపత్రాలు?... వస్తే ఏంటి రాకపోతే ఏంటి?... ఎంత పనిచేసాయి ఈ గ్రూప్‌లు. ఒక్క రోజుకే నాకు పిచ్చెక్కిపోయింది! ఈ గ్రూప్‌లకి ఒక పెద్ద దండం రా బాబు! అనుకుంటూ వెంటనే అన్ని గ్రూప్ ల నుండి లెఫ్ట్ అయ్యాడు రామం.

# మన 'బ్నిం' కు జేజేలు!

హాస్యానందం 'ఫుల్ పిల్లర్' 'కళారత్న శ్రీబ్నింగారు ఈ నెలలో ప్రతిష్ఠాత్మకమైన **అమృత లతా జీవన సాఫల్య పురస్కారం, 'దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి(బుజ్జాయి) స్మారక ఉగాది పురస్కారాలు** అందుకున్న సందర్భంగా బ్నింగారిని అభినందిస్తూ... ఒక చిన్న సింహావలోకనం.

'బ్నిం' సంయుక్తాక్షరమైనా... ఏకాక్షర మైనా అతడు సకల కళల పారంగతుడు!

ముగ్గుల్లా కన్పించే అందమైన అక్షరాలతో ఆకర్షించి... 'స్నేహం' అనే ముగ్గులోకి... అమాంతం లాగేస్తారు!

సంగీత సాహిత్యాల్లో చక్కటి అభినివేశం వుండటంతో 287కి పైగా బాలేలు రాసి, బ్నిం ప్రపంచస్థాయి రికార్డులను కొల్లగొట్టారు.

నాలుగుసార్లు 'నంది' అవార్డులు అందు కున్న బ్నింగారు- అమ్మ గురించి రాసినా, అమ్మమ్మ గురించి రాసినా, సత్యభామ అలక గురించి రాసినా... ఆదిశక్తి ఖడ్గం గురించి రాసినా... అక్షరాలూ, పదాలూ ఎంతో ఆర్ద్రంగా, అలవోకగా ఆయన కలంలోకి దూరి పోతాయి, ఒదిగి పోతాయి... సీతారామ కళ్యా ణాన్ని ఎంత రమణీయంగా రాయగలరో... కామసూత్ర నృత్య రూపకాన్ని కూడా అంతే కమనీయంగా రాయగలరు.

చిన్నప్పుడెప్పుడో బాపూ గీతల్ని చూసి, రమణగారి రాతల్ని చూసి మనసు పారేసు కున్నా బ్నింగారు... ఇప్పటికీ వాళ్ళిద్దర్నీ తన హృదయంలో ప్రతిష్ఠించుకుని ఆరాధిస్తుం టారు. 'బాపురమణ అకాడమీ, ఆత్రేయ పురం- హైదరాబాద్' అనే సంస్థని శ్రీవేగిరాజు సుబ్బరాజు గారితో కలిసి స్థాపించారు.

'స్నేహలత' కళాసాంస్కృతిక సంస్థను స్థాపించి అందరితో కలం స్నేహాలు చేసేసి, బోలెడంతమంది హృదయాలను కొల్లగొట్టారు.

ఈయన రాసిన 'మిసెస్ అండర్ స్టాండింగ్' పుస్తకానికి బాపూగారే అద్భుతమైన చిత్రాలు గీసిచ్చేంత ఆత్మీయ ఆస్తిని సంపాదించు కున్నారు.



వంశీ-శుభోదయం దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి(బుజ్జాయి) స్మారక ఉగాది పురస్కారం



అమృత లతా జీవన సాఫల్య పురస్కారం

కవి, కార్టూనిస్ట్, నృత్య రూపకర్త బ్నింగారు, మార్చి 5 వతేదీన నిజామాబాద్‌లో '**అమృత లతా జీవన సాఫల్య పురస్కారం** అందుకున్నారు.

చిత్ర కళారంగంలో సేవకు గానూ, బ్నింగారికి, **స్వర్గీయ దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి (బుజ్జాయి) పేర స్థాపించిన మొట్టమొదటి పురస్కారాన్ని వంశీ-శుభోదయం** వారు మార్చి 23, హైదరాబాద్‌లోఅందించారు.

ఈ రెండు పురస్కారాలు అందుకున్న మా బ్నింగారికి అభినందనలు తెలుపుతూ, మరిన్ని గుర్తింపులు పొందాలని హాస్యానందం ఆశిస్తోంది!

# నవ్వు వెనుక



గంగాధర్ వడ్లమన్నాటి,
9908445969

**"మధూ!... నిన్న మనం రెండు పెళ్ళి చూపులకి వెళ్ళాం కదా! నీకు ఏ అమ్మాయి నచ్చింది?" అడిగింది తల్లి.**

**"నాకు లలిత, అదే శ్రీనగర్ అమ్మాయి నచ్చిందమ్మా! ఆ అమ్మాయి నవ్వితే... మెరుపు మెరిసినట్టే ఉంది... చాలా అందమైన నవ్వు!" చెప్పాడు.**

"కానీ ఆ నవ్వులో ఏదో చిన్న వెలితి కనిపిస్తోందిరా మధూ! నాకైతే రామ్‌నగర్ అమ్మాయి నచ్చింది. ఆ అమ్మాయి నవ్వు కూడా చాలా బావుంది. పైగా వాళ్ళు డబ్బు..." అని తల్లి ఇంకేదో చెప్పేంతలో...

"ఇలా అనే ఇప్పటివరకూ నేను ఇష్టపడ్డ మూడు పెళ్ళి సంబంధాలని అటకెక్కించావ్! ఇది కూడా ఓ కారణవామ్మా!? ముందు మావయ్యకి ఫోన్ చేసి... ఆ శ్రీనగర్ సంబంధం ఖాయపరచమను. లేదంటే నా మనసుని గాయపరిచిన దానివవుతావ్!" అన్నాడు మధు అసహనంగా.

"అది కాదురా! కుర్రాడివి... వెర్రి ఆకర్షణలో పప్పులో కాలేస్తావే మోనని..." ఆమె మాట పూర్తి కాకుండానే...

"నాకు నచ్చింది అంతే! మావయ్యతో చెప్పి ఖాయపరుచు!!" ఆర్డర్ జారీ చేశాడు కోపంగా.

"సరే" అని ఫోన్ తీసి చేసి– "ఆఁ! అన్నయ్యా! ఆ శ్రీనగర్ అమ్మాయి వాళ్ళింటికి వెళ్ళి, పెళ్ళి విషయం ఖాయం చేసేయి!" చెప్పింది.

"సరే" అనిచెప్పి... కొద్ది సేపు తర్వాత ఫోన్ చేసి–

"ఖాయం చేశానురా మధూ! అమ్మకి చెప్పు! మొదట కొంచెం ఊఁ, ఆఁ... అన్నారు. మా అమ్మాయికి చాలా సంబంధాలు వస్తున్నాయి... అదీ ఇదీ... అని వాళ్ళ నాన్న డాబుపోయాడు. సరే నేనే ఓ మెట్టు దిగి, మాకూ కట్నం గిట్నం ఏం వద్దు! మా వాడూ ఇప్పటికి చాలా సంబంధాలు చూశాడు... ఏవీ నచ్చలేదు. కానీ మీ అమ్మాయి నవ్వుని పెళ్ళిచూపులలో చూసి ఇష్టపడ్డాడట. పెద్ద మనసు చేసుకోండీ... అని బ్రతిమాలితే సరే అన్నారు. ఏంటోరా మధూ! ఇరవై లక్షల కట్నం ఇస్తాం అని వెంటబడ్డ ఆ రామ్‌నగర్ సంబంధాన్ని, ఈ పిల్ల నవ్వు కోసం వదిలేసావ్ కదరా!" కించిత్ బాధతో చెప్పాడు సుబ్బారావ్.

"పోన్లే మావయ్యా!" అనేసి లోలోన తెగ సంబరపడిపోయాడు.

తర్వాత పైసా కట్నం తీసుకోకుండా, శ్రీనగర్ అమ్మాయి లలితని పెళ్ళి చేసుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత అత్తగారింట్లో, గోడకున్న ఓ ఫోటో చూస్తూ– "ఇదిగో లలితా! ఆ గోడకున్న ఫోటోలో ఎర్ర చీర కట్టుకున్నావిడ ఎవరు?" అడిగాడు మధు.

"భలే వారే! ఆమెని మన పెళ్లిలో చూశారుగా... మా పిన్ని!"

"మరి ఆమె పక్కనే నించున్న అమ్మాయి ఎవరు?"

"ఎవరండీ?..."

"నీలం చీరలో, చక్కగా నవ్వుతోంది చూడు... ఆ అమ్మాయి!" చెప్పాడు ఆ ఫోటో దగ్గరకి వెళుతూ...


"ఆమెని గుర్తుపట్టలేదా మీరు?" అంటూ సత్రున వంటగదిలోంచి వచ్చేసి– "అయ్యో!" అంటూ నెత్తి కొట్టుకుంది.


"ఏమైంది?!" అడిగాడు కంగారుతో కూడిన అయోమయంగా.

"ఏమవ్వడం ఏంటి నా బొంద! ఆమె మా పిన్ని వాళ్ళ అమ్మాయి. ఆ ఫోటో, ఆమె డెంటల్ సర్జరి చేయించుకోక ముందుది.... అందుకే మొన్న మీరు ఆమెని మన పెళ్ళిలో చూసినా గుర్తు పట్టలేదు!"

"ఆమె ఎందుకు డెంటల్ సర్జరి చేయించుకుంది?" అడిగాడు.

"ఎందుకంటే... పెదాలు కాస్త లావుగా ఉన్నాయని, ముందు పళ్ళు కొంచెం పెద్దగా ఉన్నాయని, పలు వరస ఎత్తు అనే నామోషితో మూడు లక్షలు ఖర్చు





పెట్టి, నాలాంటి అందమైన నవ్వు కోసం ఆ సర్జరి చేయించు కుంది!" చెప్పింది కాస్త గర్వంగా.

"ఏడిసినట్టుంది! మనస్ఫూర్తిగా మనసుతో నవ్వే ఏ అమ్మాయి నవ్వు అయినా బావుంటుంది గానీ... దానికి కృత్రిమ పోకడలు అనవసరం. అందుకే అనుకుంటాను, సహజంగా ఉన్న ఆమె అప్పటి నవ్వు చాలా బావుంది. ఆ మాటకి వస్తే, నీ నవ్వు కంటే కూడా ఆమె నవ్వు బావుంది!" అన్నాడు ఆ ఫోటో వంకే చూస్తూ.

"అదేంటి అంత మాట అనేసారు!... నా మూడు లక్షలు వృధానా?!" అడిగింది లలిత దిగాలుగా.

"నీకెందుకు డబ్బు వృధా?!...మీ పిన్ని కూతురు సర్జరీకి నువ్వు డబ్బులిచ్చావా?" అడిగాడు.

"మా పిన్నికి కూతుర్లే లేరు!... ఆ ఫోటోలో ఉన్నది నేనే. మీరేవంటారో చూద్దావని... అలా అబద్ధం చెప్పాను... అది నా సర్జరీకి ముందు ఫోటో!" అని సిగ్గుపడుతూ చెప్పడంతో...

'అంటే... పోయి, పోయి ఓ కృత్రిమ నవ్వుని ఇష్టపడ్డానా... అదీ ఇరవై లక్షల సంబంధం కాదని మరీ! మా అమ్మ చెప్పినట్టు పప్పులో కాలేసాను!' అని మనసులో అనుకుంటూ...

ఏం చెప్పాలో తెలియక తెల్ల మొహం దాచా లని, నల్లగా మాడ్చుకున్నాడు మొహం... ఏడ్వలేక ఓ చిరునవ్వు నవ్వాడు పాపం మధు ఈతరం కుర్రాలకి ప్రతినిధిలా!.

# కొత్త పుస్తకం!



## నవ్వుల పువ్వుల వెన్నెల హాసం

రచన: **చంద్రప్రతాప్ కంతేటి**

**ప్ర**తిష్ఠాత్మకమైన పదవులు నిర్వహించిన చంద్రప్రతాప్‌గారు, ఈనాడు, విపుల, చతురలలో పనిచేసి, అపారమైన అనుభవంతో పత్రికారంగంలోని హాస్యాన్ని మనకు ఈ పుస్తకంలో అందించారు. పత్రికా రంగాన్ని అంశంగా తీసుకున్నా లేకపోతే ఆయన చిన్ననాటి జ్ఞాపకాలను అంశంగా తీసుకున్నా అందులోని హాస్యాన్ని మాత్రమే మనకందించడం గొప్ప విషయం.

ఈ పుస్తకంలో హాస్యాన్ని చాలా అలవోకగా మనకందించారు ప్రతాప్‌గారు.

దాదాపు రెండు సంవత్సరాలుగా 'సహరి' అంతర్జాల వారపత్రికలో వస్తున్న ప్రతాప్‌గారి- 'వెన్నెల హాసాని'కి నేను కార్టూన్లు గీయడం నా అదృష్టం. ఎందుకంటే నేను 45 సంవత్సరాలుగా అనేక అంశాలపై జనరల్ కార్టూన్లు గీస్తూ పోతున్నాను. కానీ ప్రతాప్‌గారు ప్రత్యేకమైన హాస్య రచనలకి నేను ఇంకొంచెం హాస్యాన్ని జోడించి కార్టూన్లు గీయడం నా ప్రత్యేకమైన, విశిష్టమైన ప్రక్రియగా మారిపోయింది.

వారు నాకిచ్చిన మరో గొప్ప వెసులుబాటు ఏమిటంటే ఆయన మీద నేను హాస్య కార్టూన్లు గీసినా వారు అభినందించడం.

ఆయన వారి మీద వారే హాస్యంగా పాటలు రాసుకుంటూ పత్రికా రంగంతోపాటు అపార్టుమెంట్లు, చిన్ననాటి చిలిపిచేష్టలు, కరోనా... ముఖ్యంగా మనం వాడుక భాషలో భాషాపరంగా చేసే తప్పులలోని హాస్యం, టీవీల్లో హాస్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో హాస్యం, ఇంటింటి రామాయణం, పెళ్లిళ్ళలో జరిగే అంశాలు, ఛానళ్ళు ఇలా అనేకానేక అంశాలు తీసుకుని తీరిక లేకుండా ఎక్కడా హాస్యం మిస్ అవకుండా మనకందిస్తూ వారు పాఠకులకు ఎంతో సేవ చేస్తున్నారు.

ఈ పుస్తకం కూడా మన నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సంఘటనలకు హాస్యాన్ని జోడించి మనకందించారు. కొన్ని కథలు నవ్విస్తే... మరి కొన్ని కథలు ఆలోచింపజేస్తాయి. ఏదైమైనా మనం చెప్పదల్చుకున్న విషయాన్ని హాస్యం జోడించి చెబితే తప్పకుండా పాఠకుల మనసులకు హత్తుకుంటుంది.

ఈతరం పాఠకులకు పుంఖానుపుంఖాలుగా హాస్యాన్ని అందించిన ప్రతాప్‌గారి ఈ 'నవ్వుల పువ్వుల వెన్నెల హాసం'- ప్రతి ఒక్కరూ చదివి తీరాల్సిన పుస్తకమిది.

**వెల:** 125 రూపాయలు. **ప్రతులకు:** శ్రీమతి నాగమణి కంతేటి, ఫోన్: 8008143507

**-బాచి,** కార్టూనిస్టు



## మహిళా కార్టూనిస్ట్ ల కోసం....

**గ**త నెల హాస్యానందంలో ఔత్సాహిక మహిళా కార్టునిస్టుల కోసం ఇచ్చిన ప్రకటనకి అనూహ్యమైన స్పందన లభించింది.

ప్రముఖ కార్టూనిస్టులు శ్రీఅరుణ్ మరియు శ్రీనాగిశెట్టి గార్లచే ఈ కార్టూన్ నేర్పించే కార్యక్రమం మొదలుపెట్టాము.

ఉత్సాహంగా తమ పేర్లు నమోదు చేసుకున్న అందరికీ తగు విధమైన సూచనలతో కార్టూన్లు నేర్పించడం కూడా మొదలు పెట్టడం జరిగింది.

భవిష్యత్తులో తెలుగులో మహిళా కార్టూనిస్టులుగా పేరు సంపాదించ దానికి, హాస్యానందం ప్రెస్టీజియస్‌గా తీసుకొని ఈ కార్యక్రమం మొదలు పెట్టడం జరిగింది. దీంట్లో పాల్గొనే మహిళలంతా తాము శ్రద్ధగా స్పందిస్తూ, చక్కగా ప్రాక్టీస్ చేస్తూ ఉన్నప్పుడే వారు మంచి కార్టూనిస్టులుగా రూపొందటం జరుగుతుంది. కాబట్టి అందరు శ్రద్ధతో మన కార్టూని స్టులు నేర్పే పద్ధతులని పాటిస్తూ మంచి కార్టూనిస్టులుగా ఎదగగలరని కోరుతున్నాం.

తమ విలువైన సమయాన్ని ఇలా మహిళా కార్టూని స్టుల్ని తయారు చేయడం కోసం వెచ్చిస్తున్న మన కార్టూ నిస్టులు శ్రీ అరుణ్ గారికి, శ్రీ నాగిశెట్టి గారికి అందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

అలాగే కొత్త ఔత్సాహిక మహిళా కార్టూనిస్టులు కూడా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.


**మీ పేరు, వయసు, చదువు, ఫోన్ నెంబర్‌తో పాటు మీరు వేసిన రెండు బొమ్మలు కూడా జత చేస్తూ...**

**telugumahilacartoonists@gmail.com**

**ఈ మెయిల్ పంపించండి.**

# డాక్టర్ డింగరి

DAYAKAR








## ప్రముఖ కార్టూనిస్టు శ్రీ ప్రసాద్ కాజ

## ఫన్ ప్రశ్నలకు-

## ప్రముఖ హాస్య నటులు సుదర్శనమ్

## పంచ్ సమాధానాలు

*Cartoons: Sangram*

✦ వడ్డీకాసులవారికి అప్పు ఎప్పుడు తీరు తుందంటారు?

**తీరిపోతే, మన 'మొక్కులు'(కోరికలు) తీర్చే దెవరు? కలియుగ దైవం కదా... ఈ యుగంలో తీరదేమో! మనకోసం ఆయనే తీర్చుడు... అంతా విష్ణుమాయ!**





✦ ఏడ్చే మగాళ్ళను నమ్మకూడదు." అంటారు కదా?... ఏం? వాళ్ళకి కష్టాలు, బాధలు ఉండవా?

**అనే ఉంటారు... మగాళ్ళ 'ప్రతిపక్షపాతులు'! కనీసం ఏడ్చే అవకాశం కూడా మగాళ్ళకి లేకుండా చేయాలన్న 'కుట్ర' ఏదో ఈ సామెతలో ఉందనిపిస్తుంది!! ('మనసారగ ఏడ్వనీరు...' అని రహస్యంగా ఏడ్చాడో కవి!)**



✦ ఎవరికైనా దెయ్యం పడితే... "వాళ్ళకి దెయ్యం పట్టింది." అని స్త్రీ లింగం లోనే అంటారు. మగదెయ్యాలు పట్టవా?

**భయపడేవాళ్ళు దెయ్యాలవ్వరు... భయపెట్టేవాళ్ళే అవుతారు! అందుకే 'స్త్రీ' లింగ ప్రయోగం!!**


✦ అనేక టేకులు తీసుకుని నటించే యాక్టర్స్ గొప్పా? సింగిల్ టేక్‌తో ప్రజలను మెప్పించే రాజకీయ నేతలు గొప్పా?

**మొదటి కేటగిరీది మెప్పించటం... రెండవ కేటగిరీది వంచించటం!! ఇక మీరేలా నా చేత చెప్పించటం?!**



✦ అమ్మాయిలు సిగ్గు పడేది ఎప్పుడు?

**కలి(కి)యుగానికి సంబంధించిన ప్రశ్నలే అడగాలి!! పాత యుగాల ప్రశ్నలు అనుమతించబడవు!**





✦ కోడికి, పకోడికి తేడా?

**కోడిని కోడిగా తినే కన్నా, పకోడిగా తింటే పసందుగా ఉంటుంది... అని మీకు తెల్సీ అడుగుతారేం?!**

✦ కన్యపిల్ల చేతికి గోరింటాకు ఎఱ్ఱగా పండితే 'మంచి మొగుడు వస్తాడు.' అంటారు. అదే కుర్రాళ్ళకు పండితే....?

**కుర్రాళ్ళకి పండాల్సింది చేతి(లో) గోరింటాకు కాదు... నోటి(లో) తమలపాకు... ఐమీన్ తాంబూలం... ఐ మీన్ కిళ్ళీ! పండితే పసందైన పడుచు పిల్ల దొరుకుతుందని (పెళ్ళికి) శాస్త్రం చెబ్తోందని శాస్త్రిగారు చెప్పారట!!**





✦ కోడి తెల్లవారుజామునే ఎందుకు కూస్తుంది?

**ఇన్సోమ్నియా(నిద్రలేమి) అనే జబ్బు వల్ల... కావచ్చు! గుర్రెట్టి నిద్రోయే వాళ్ళను చూసి ఓర్వలేక...కుళ్ళు వల్ల కావచ్చు!**

✦ ఓట్లు వేసేముందు చూపుడువేలుకే మార్క్ ఎందుకు వేస్తారు?

**మీరు ఏది చూపిస్తే దానికే వేస్తారు... చూపించే వేలు కాబట్టి దాన్ని చూపుడు వేలు అన్నారు!!**








✦ 'సాయంత్రం వచ్చేటప్పుడు పూలు తెండి.' అని భార్య అంటే... భర్త రెండు పొట్లాల పూలు తెచ్చాడు. ఎందుకు?

**ఈ 'పొట్లాల' లెక్క ఆవిడ చెప్ప లేదుగా?!... రెండవ పొట్లం మర్నాడు పొద్దుటికేమో... ఫ్రిజ్‌లో పెట్టుకుంటాడు... మీకెందుకండీ ఆడి పొట్లాల గోల?!**



✦ పెళ్ళిలలో వధూవరులను ఒకరి పాదాలను ఒకళ్లచేత తొక్కిస్తారు. ఎందుకు?

**ఇద్దరూ కలిసి పంతులు పాదాలు తొక్కితే బావోదని!!**



✦ ఉప్పుకి, కర్పూరానికి తేడా తెలుసు కోవాలంటే?

**కళ్ళజోడు వేయించుకోవాలి!!**

✦ త్రిశంకు స్వర్గానికి మంచి ఉదాహరణ చెప్పండి?

**'శంకు' తెలుసు... ఈ త్రిశంకు ఎవరు సామీ?... కొత్తగా వచ్చిన కార్టూనిస్టా?**



# పెళ్లి తమాషాలు



డా. కేతవరపు రాజ్యశ్రీ,
8500122990

**"హాయ్ నిర్మల! ఎప్పుడు వచ్చావు కెనడా నుంచి? పెళ్లి బాగా జరిగిందా?" నా చిన్ననాటి ఫ్రెండు నిర్మల ఫోన్ చేయగానే నేను ప్రశ్నల వర్షం కురిపించాను.**

**చిన్నప్పుడు స్కూల్ మేట్స్ అయిన నేను, నిర్మల, వనజ ముగ్గురం కూడా ఇప్పటికీ... అప్పుడప్పుడు కలుసుకుంటూ, యోగక్షేమలు కనుక్కుంటూ వుంటాము.**

"జయా! మేము వచ్చి వారం రోజులు అవుతుంది. కొంచెం జెట్‌లాగ్ అది తగ్గి ఇప్పుడిప్పుడే కాస్త బయట ప్రపంచాన్నిచూస్తున్నాము... రేపు మధ్యాహ్నం మన ముగ్గురం కలుసుకుందాము. మీ ఇంటికి లంచ్‌కి వస్తాను. వనజను కూడా రమ్మని చెప్పు! నువ్వేమీ వండకు. బయట నుంచి తెప్పించుకుందాం. హాయిగా కూర్చుని కబుర్లు చెప్పుకుందాం!" అంటూ నిర్మల చెప్పింది.

"ఓ!... అలాగే! చాలా కబుర్లు చెప్పుకోవాల్సి ఉన్నాయి. పెళ్లి విశేషాలు కూడా చెబుదువు గాని" అని ఫోన్ పెట్టేసాను.

మొదట నేనూ సరే ఫుడ్ బయటనుంచి తెప్పించుకుందాం లే... అని ఊరుకున్నాను. కానీ వీళ్ళు వచ్చేదాకా నాకు పని ఏమీ లేదు కదా అనుకుంటూ కిచెన్‌లోకి దూరాను. చిన్న చిన్నగా ఒక్క ఐటమ్ చేస్తూ... వాళ్ళువచ్చేసరికి పూర్తిగా వంట అంతా అయిపోయింది.

సరిగ్గా వాళ్ళు వచ్చే సమయానికి మొహం కడుక్కుని తయారై కూర్చున్నాను.

ఇద్దరూ పన్నెండు గంటల కల్లా వచ్చేశారు. రాగానే ఒకరినొకళ్ళు కావలించుకుని హాయిగా కూర్చుని కబుర్లు చెప్పుకోవడం మొదలు పెట్టాం. ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ కదా... అందుకోసమని మొదట పెళ్లి కబుర్లలో పడిపోయాం.

ఈ మధ్య ఒక సినిమాలో పెళ్లి సీన్‌లో, పెళ్ళికొడుకు అక్కడ ఉన్న అక్షింతలు తీసుకుని నోట్లో వేసుకుంటాడు. ఇది తమాషాగా అనిపించినా... ఈ మాత్రం కూడా తెలీదా పెళ్లి కొడుకుకి?... అతిశయోక్తి కాకపోతే అని కూడా అనుకున్నా అంది వనజ.


"అవును నిన్న టీవీలో ఓ సినిమా మావారు చూస్తుంటే, నేనూ పక్కనే కూచున్నా. ఏదో పెళ్లి చేయిస్తున్న పురోహితుడు, పెళ్లి కొడుకుని 'మమ' అని ముక్కు పట్టుకోండి అని అంటాడు. వెంటనే పెళ్లి కొడుకు 'మమ' అని అయ్యవారి ముక్కు పట్టుకుంటాడు. "ఇదిగో!... నాది కాదయ్యా మీ ముక్కు మీరు పట్టుకోవాలి!" అంటూ గోల పెడతాడు.

"అవును. ఇలాంటివి కొన్ని నిజ జీవితంలో కూడా జరుగుతాయి. ఒకసారి మేమందరం మా బావగారి కొడుకు పెళ్లికి అందరం కలిసి సరదాగా ట్రైన్‌లో ఒక బోగి బుక్ చేసుకుని వైజాగ్ వెళ్ళాము. నిజానికి పెళ్లికూతురు వాళ్ళు కాశీలో ఉంటారు. పెళ్ళికొడుకు హైదరాబాదులో ఉంటాడు. అయితే పెళ్లికూతురు తరపు బంధువులందరూ కూడా విశాఖపట్నంలో ఉండడంతో, అక్కడ పెళ్ళి చేస్తే బాగుంటుంది, అందరూ కాశీ రావడం కష్టమని పెళ్లి విశాఖపట్నంలో జరుపుకుందామని ఇరువర్గాల వారు నిర్ణయం చేశారు. పెళ్లి కాగానే అందరం సరదాగా సింహాచలం వెళ్లి సింహాద్రి అప్పన్న దర్శనం చేసుకుందామని అనుకున్నాము.

పెళ్లి మంటపం ఎదురుగా ముందు వరసలో కుర్చీలలో మా కుటుంబ సభ్యులందరం కూర్చుని పెళ్లిని తిలకిస్తున్నాం... మాది పెద్ద కుటుంబం అవడంతో చాలా పెళ్ళిళ్ళు అందరం దగ్గర ఉండిచేయించడం జరిగింది. అందుకని పెళ్ళి విధానం అందరికీ కొట్టిన పిండే. అయితే ఇక్కడ పెళ్లి చేయించే అయ్యవారు వధూ వరులు జీలకర్ర బెల్లం పెట్టుకున్న తర్వాత, కాసేపటికి అమ్మాయి అబ్బాయి వాళ్ళ చేత తలంబ్రాలు పోయించారు.

తర్వాత మంగళ వాయిద్యాలు వాయిం చండి అంటూ అమ్మాయి మెడలో మంగళ సూత్రాలు కట్టించారు.

మేమందరం ఒక్కసారి అవాక్కయ్యాము. అదేమిటి మంగళసూత్రం కట్టిన తర్వాత కదా



తలంబ్రాలు పోయించేది. ఇలా చేశాడు ఏమిటి పంతులుగారు? ఇది విశాఖపట్నంలో ఆచారమా ఏమిటి అని అనుకున్నాం.

ఇంతలోనే మళ్ళీ అమ్మాయి తల్లిదండ్రులని అల్లుడు కాళ్ళు కడిగి కన్యాదానం చేయండి అని అన్నాడు... మా అందరికీ మతులు పోయినాయి... ఈయన ఏదో తూతూ మంత్రం పెళ్లి చేస్తున్నాడు అని అనుకుని... అందరం మా అందరిలోకి పెద్ద తోడికోడలు విశాలాక్షితో–

"నువ్వుమాట్లాడు అయ్యవారితో... ఈయన ముందుది వెనక, వెనకది ముందు చేయిస్తున్నాడు" అన్నాం.

సరే అని చెప్పి ఒక్క నిమిషం ఆగి ఆవిడ–

"అది కాదండి పెళ్లిలో... ఇది ముందర అయినా తరువాత కదా అది!" అని అన్నప్పుడు అయ్యవారికి ఏమి చెప్పాలో తెలియక, చాలా తెలివిగా– "అలాగా అండి! మీరు ఎలా చెప్తే అలా చేద్దామండీ!... మీ పద్ధతి ప్రకారమే చేద్దామండి!" అంటూ సర్దుకున్నాడు.


తర్వాతి కార్యక్రమాలన్నీ కూడా చివరికి అరుంధతి నక్షత్రం చూపించడానికి వధూవరులను తీసుకెళ్లేటప్పుడు కూడా– "అమ్మా ! దీని తర్వాత ఇదేనా అమ్మా ?! దీని తర్వాత ఇదేనా" అంటూ మా వంక భయంభయంగా చూస్తూ కార్యక్రమాన్ని నడిపించాడు. మాకు అయోమయం అయిపోయింది.

అప్పుడు అమ్మాయి తల్లిదండ్రులను పిలిచి, "ఏవండి! ఈ అయ్యవారికి ఏమి తెలియడం లేదు!... మన పెళ్లి వ్యవహారం అది సరిగ్గా చేయించడం లేదు... ఎవరితను అని అడిగాము.

అప్పుడు వాళ్లు కూడా–"అవునండి! మేమూ కూడా చూస్తున్నాము. ఏమిటో ముందుది వెనక, వెనకాలది ముందు చేయిస్తున్నాడు. ఉండండి అసలు విషయం కనుక్కుంటా!" అని వెళ్లారు.

అసలు విషయం ఏమిటంటే వీళ్ళు కాశీలో ఉండబట్టి, వీళ్ళ దగ్గర చుట్టాలైన వారికి ఈ పెళ్లి చేసే అయ్యవారినీ, పెళ్లి చేసే హాలునీ, పెళ్లివారి విడిదినీ చూసి పెట్టమని చెప్పారుట.

వాళ్ళు నిజానికి మంచి పండితుడినే మాట్లాడారు. అయితే ఆ రోజు ఆయనకి జ్వరంగా



వుండి… తన తెలిసిన ఒక దేవాలయంలోని పూజారిని ఈ పెళ్లి కార్యక్రమం జరిపించమని కోరాడుట. ఈ గుడి పూజారి దేవుడి పుజలే కానీ, ఎప్పుడూ పెళ్లిళ్లు జరిపించలేదుట… అందుకని, అసలు ఒరిజినల్ అయ్యవారిని, పెళ్లి ఎలా జరిపించాలి అని అడిగి, విశేషాలు అన్నీ, దేని తరువాత ఏది అని కనుక్కుని వచ్చాడుట. తీరా ఇక్కడికి వచ్చేసరికి, ముందు వరసలో కూర్చున్న మమ్మల్నందర్ని చూసేసరికి, ఎక్కడ తప్పు చేస్తానోనన్న భయంతో… ఏది ముందు , ఏది వెనక మర్చిపోయాడుట. అదీ కాక పెళ్లి హడావిడిలో ఎవ్వరూపట్టించుకోరని, ఎలాగో అలాగ తాళి కట్టించేస్తే అయిపోతుందని అనుకున్నాడు. కానీ మేము అక్కడే కూర్చుని, వివరం అడిగేసరికి విషయం అంతా బయట పడింది.

ఇంతమంది నిలదీసేసరికి పాపం ఆ గుడి పూజారికి భయం వేసి, చివరికి సంభావన కూడా తీసుకోకుండా గబగబా బయలుదేరి వెళ్లిపోయాడు.

ఇన్నేళ్లయిన తర్వాత కూడా ఆ విషయం గుర్తుకొచ్చి మేము నలుగురం కలుసుకున్నప్పుడు నవ్వుకుంటూ ఉంటాం!" అంటూ నా అనుభవాన్ని వాళ్ళతో పంచుకున్నా.

"అవునూ నిర్మలా!… ఇంతకీ మీ చెల్లెలు కూతురి పెళ్లి విశేషాలు చెప్పు! ఎలా జరిగింది?"

"అక్కడ కూడా ఇలాంటి తమాషానే జరిగింది… పెళ్లి కెనడాలో కదా!… మీకు తెలుసు కదా మా చెల్లి వాళ్ళు కెనడాలో సెటిల్ అయ్యారు. వాళ్ల అమ్మాయి సుమన పెద్ద పోస్టులో ఉద్యోగం చేసుకుంటూ, మంచి ఇల్లు అది కొనుక్కున్న తర్వాతే పెళ్లి చేసుకుంటాను అని 38 ఏళ్లు వచ్చేంతవరకుచేసుకోలేదు. మా చెల్లి , మరిది ఆశ వదిలేసుకున్నారు. చివరకు తన ఆఫీసులోనే నలభైఏళ్ల 'అక్కడి' పిల్లవాడితో ప్రేమలోపడి, పెళ్లి చేసుకుందామని అనుకుని తల్లిదండ్రులకు చెప్పింది. వాళ్ళు ఎగిరి గంతే శారు. ఎందుకంటే అసలు పెళ్ళేవద్దంటూ బిగుసుకుని కూర్చున్న అమ్మాయి ఎవరో ఒకరిని చేసుకుంటే… చాలురా బాబు అను కున్నారు వాళ్ళు… అందుకే వాళ్లకు చాలా సంతోషం వేసింది.


ఇరువైపుల కుటుంబాల వాళ్ళకి ఏమి అభ్యంతరం లేకపోయింది. సరే పెళ్ళి మన సంప్రదాయం ప్రకారమే చేసుకుందామని నిశ్చయించుకున్నారు.


కెనడాలో పెళ్ళి ఫిక్స్ చేసుకున్నారు. పెళ్ళి కొడుకు అమ్మమ్మ వాళ్ళు పెద్దవాళ్ళు కాబట్టి రాలేమని చెప్పారు. బెంగళూరు నుంచి మేము కెనడాలో పెళ్లికి బయలుదేరి వెళ్ళాము… పెళ్లికూతురు పెళ్లికొడుకు కుటుంబాలు అక్కడే సెటిల్అయ్యారు కాబట్టి వాళ్లకి మన పెళ్లి పద్ధతులన్నీ కూడా ఏమి తెలియవు కాబట్టి బెంగళూరు నుంచి వెళ్లిన నా మీద, మాఆయన మీదే పెళ్లి పెత్తనం అంతా ఆధారపడి ఉంది. నేను కూడా ఎందుకైనా మంచిదని మన వివాహ ప్రక్రియ లో ముఖ్యమైన ఘట్టాలన్నీ ఒకసారి గుర్తు చేసుకున్నాను.

## ఈ నెల 'దినం'


### మార్చి,8- నేషనల్ నో స్మోకింగ్ డే





పెళ్లి చేసే అయ్యవారు కూడా అక్కడ కెనడాలో స్థిరపడిన వారే కావడం వలన ఆయనకి కూడా అంతంత మాత్రమే ఈ పద్ధతులన్నీ తెలుసు. కానీ తనకి ఏమీ తెలియదు అన్న విషయం బయటపడకుండా, కార్యక్రమాలు కొన్ని వదిలి వేద్దామని చూశాడు. నేను పక్కనే కూర్చుని, అది ఇలాగ చేయండి, దీని తర్వాత అలాచేయండి అని చెప్పడం మొదలు పెట్టాను. ఇంత దూరం వచ్చి, ఇంత గ్రాండ్‌గా మంటపం అలంకరణ చేసి, మన సాంప్రదాయాలు వదిలేసి చేసుకోవడం ఎందుకు? నేను చెబుతాను. మీరు చేయించండి అంటూ పక్కనే కూర్చున్నా.




పెళ్ళికొడుకు కూడా చాలా సరదాగా ఉండి చక్కగ తయారయి, మంత్రాలన్నీ చక్కగా చెబుతూ చేసుకుంటున్నాడు.

తర్వాత అసలైన ఘట్టం మాంగల్య ధారణ కార్యక్రమం వచ్చింది . అబ్బాయికి మంగళ సూత్రం చేతికి ఇచ్చి, మూడుముళ్ళు వేయండి అని చెప్పారు. మంగళ వాయిద్యాలు స్పీకర్‌లో గట్టిగా పెట్టండి అంటూ అక్కడ ఈవెంట్ మేనేజర్‌కి పురమాయించి, పెళ్ళికూతురి జడ పైకి పట్టుకుని ఆసక్తిగా చూస్తున్నా. పెళ్ళికొడుకు మంగళసూత్రాన్ని చేతిలోకి తీసుకొని, సూత్రాలకు వున్న దారానికే మూడు ముళ్లు వేసేస్తున్నాడు.

అప్పుడు కంగారుగా "అలా కాదు అమ్మాయి మెడలో మూడుముళ్ళు వేయాలి!" అన్నాను

"ఎలా వేయాలి ఆంటీ?" అని అడిగాడు.

"అమ్మాయి మెడ వెనకాల ఇలా వేయాలి!" అని చూపిస్తుంటే, పెళ్లి చేసే అయ్యవారికి కంగారు వచ్చి– "అమ్మా!... అమ్మా!... మీరు కట్టకూడదు! అబ్బాయే కట్టాలి!" అన్నాడు.

"అయ్యో! నేనెందుకు కడతానండి?... అబ్బాయి అడిగాడని చూపిస్తున్న!" అన్నాను.

పాపం అబ్బాయికి ఆ మూడు ముళ్ళు గట్టిగా వేయడం చాలా కష్టమైపోయింది.

వనజ అందుకుంటూ... "ఈ మధ్య ఒక పెళ్ళిలో ఒకవింత చూశాను తెలుసా?... ఏమిటంటే పెళ్ళికూతురు అన్నయ్య యు.ఎస్‌లో ఉంటాడు. ఆ అమ్మాయి పెళ్ళి కాగానే వీడియో కాల్ చేసి... ఆ అబ్బాయికి దండం పెట్టించారు పెద్దలు. అతను కూడా వీడియో కాల్ లోనే అక్షతలు వేసాడు... చూసే వాళ్ళందరూ ముక్కున వేలేసేకున్నామంటే నమ్ము!"

"ఈ మధ్య ఇంకో పెళ్లిలో, తలంబ్రాల ముందర అయ్యవారు మంత్రాలు చదువుతుంటే , ఏమి చెయ్యాలో తోచక , పెళ్లికొడుకు ఆ బియ్యం కొద్దికొద్దిగా నోట్లో వేసుకోవడం మొదలుపెట్టాడు... చూసి అవాక్కయ్యాను. ఇవన్నీ సినిమాల్లో చూపిస్తే అతిశయోక్తి అనుకున్నా... కానీ నిజంగానే నిజ జీవితంలో కూడా జరుగుతున్నాయి!..." అంటూ నవ్వుకున్నాము.


"అయ్యయ్యో! మాటల్లో పడి ఆకలి మాట మర్చిపోయాం! రండి! తిందాం! నేనే వంట ఇంట్లోనే చేసేసాను!" అని అన్నాను.

"ఓ!... అవునా చాలా శ్రమ తీసుకున్నావే! కానీ చాలా సంతోషం... ఈ మధ్య ఎవరి ఇంటికి వెళ్ళినా, ఏ ఫంక్షన్‌కు వెళ్లినా, బయట నుంచే తెప్పిస్తున్నారు. కడుపు అంతా పాడై, గ్యాస్ చేరి అవస్థ పడాల్సి వస్తుంది." అంటూనే ఆనందంగా భోజనాలు ముగించారు.

✦✦✦

పెళ్లికబుర్లతో మూడు గంటలు గడిపేసిన మిత్రత్రయం ఆనందంగా ఎవరి ఇళ్ళకు వాళ్ళు బయలు దేరారు.

ఇక్కడ మరో విశేషమేమిటంటే...
పెళ్ళికబుర్లు, మంచి విందుతో కడుపు నింపుకున్న వీళ్ళు... పక్క గదిలో ఆకలితో అలమటిస్తున్న జయ భర్త గోపాల్‌ను పట్టించుకోక పోవటం కొసమెరుపు!



# మంత్రి.... మజాకా!



కంచనపల్లి ద్వారకనాథ్,
9985295605

**అద్భుత అలంకరణలతో... రంగు రంగుల బల్బుల తోరణాల వెలుగులో మహారాజా కళ్యాణ మండపంలో బిజినెస్ మ్యాన్ సత్య ప్రకాష్ గారి ఏకైక కుమారుడికి ఘనంగా చేస్తున్న పెళ్ళి అది. కళ్యాణ మండపం ముందు ఖరీదైన కార్లు... విఐపీలు... అధికారులు... ధగధగా మెరిసిపోయే పట్టు చీరలతో, రకరకాల ఆభరణాలతో అందాలని ఒలకబోస్తున్న ఆడవాళ్ళతో అక్కడ వాతావరణం ఇంద్రలోకంలా వుంది.**

రఘునందన్ వెడ్స్ రంజని అన్న ఫ్లెక్సీలు కళ్యాణ మండపంలోకి వెళ్ళే దారికిరువైపులా రకరకాలుగా నిలబెట్టారు.

ఇంకో అరగంటలో పెళ్ళికొడుకు... పెళ్ళి కూతురు మెడలో తాళి కడతాడు అన్న సమయంలో కల్యాణ మండపంలోకి గబగబా దబ్బ పండు రంగులో మిసమిస లాడుతూ... ధగధగ మెరిసిపోతూ ఒక మంత్రి, అతని నలుగురు గన్‌మేన్‌లతో ఎంట్రి ఇచ్చాడు.

పెళ్ళికి వచ్చిన వాళ్ళు అతన్ని చూడగానే గుసగుసలు మొదలయ్యాయి. మంత్రి, కూర్చున్న వారి వైపు చూస్తూ ఆగి చిరునవ్వుతో రెండు చేతులు ఎడం భుజం వైపుకు జోడించి సినిమాలో హీరోలా నమస్కరించగా... కూర్చున్న వారిలో కొందరు నమస్కరించారు.

మరికొందరు వాళ్ళను చూసి నమస్కరించక పోతే బాగుండదని నమస్కరించారు. కొందరైతే లేచి నిలుచుని నమస్కరించారు.

మంత్రి కుడి చెయ్యి పైకెత్తి పిడికిలి బిగించి చూపి, చేతి వేళ్ళని థమ్సప్ సింబల్ లా చూపి గర్వంగా నవ్వుతూ... మళ్ళీ నమస్కరించి కళ్యాణ వేదిక దగ్గరికి నడిచాడు. పెళ్ళి కొచ్చిన వారిలో గుస గుసలు మొదలైనాయి. అబ్బో! మంత్రి గారు పెళ్ళికి వచ్చారంటే ప్రకాష్‌గారికి ఎంత పలుకుబడి వుందో... అందుకే ఆ దర్జా, దర్పం అని కొందరు, ప్రకాష్ గారి బంధువులు, మంత్రితో సంబంధాలు వున్నాయి కాబట్టి మన పిల్లలకి ఉద్యోగాలు, పనులు చేయించుకోవచ్చు... అని అనుకున్నారు.

పెళ్ళి వేదిక పైకి మంత్రిగారు రాగానే– “అరేయ్ బావా!... ఇప్పుడా వచ్చేది... ముహూర్తం టైంకి! ఏమన్నా బాగుందా?... మీ ఆవిడ ఏది రాలేదా ?”

“అరె బావా! ఇంటి నుండి త్వరగా బయలుదేరి వస్తామంటే... ఎక్కడ తీరిక?! ఒకపక్క విఐపీలు, అధికార్లు, ఫైళ్ళు, సంతకాలు... ఒకటేమిటి ఇప్పటికి కుదిరిందనుకో... ఇక మా ఆవిడ అలంకరణ మొదలు పెట్టిందంటే... ఏ టైంకు ముగిస్తుందో తెలియదు! అందుకే నేనే వచ్చేసా! నాకు అర్జంటుగా టౌన్ హాల్లో మీటింగ్ వుంది!” అనగానే...

‘నీ కోతలు... నీ నాటకాలు చిన్నప్పటి నుండి నాకు తెలియనివి కావు!’ అని మనసులో అనుకుని– “అయినా నీవు ఇక్కడికి వచ్చినపుడు నీ ఎస్కార్ట్ వెహికల్ సౌండ్, పది కార్లు, అధికారులు హడావిడి కనపడలేదే...” అన్నాడు.

“అరె బావా! నేను అలా వస్తే ట్రాఫిక్ జాం అయిపోతుంది. ఈ రోజు చాలా పెళ్ళి ముహూర్తాలు ఉన్నాయి. వాటన్నిటికీ ఆటంకం అని మాములుగా కారులో వచ్చా!” అన్నాడు.


“ఒరేయ్! మంత్రి పదవి కన్న ఈ గెటప్‌లో అదిరిపోయావ్ రా!” అనగానే... “ఊరుకో బావా! నాకు నీ దిష్టి తగిలేట్టు వుంది!” అంటుండగా...

పురోహితుడు ‘గట్టి మేళం’... అని అరుస్తూ “మాంగల్యం తంతునామే మమ జీవన...” మంత్రం చదవడం... అందరుతో పాటు మంత్రి అక్షింతలు వేయడం జరిగిపోయింది.

సత్యప్రకాష్‌తో– “అరె బావా!... నాకు టైం అయ్యింది! వస్తా!” అంటూ బయలుదేర బోతూ అందరికి మళ్ళీ నమస్కరించి కళ్యాణ మండపం బయటికి హుందాగా నడుస్తూ వెళ్ళాడు.

కారులో ముందు సీటులో డ్రైవర్ పక్కన ముకుందరావు వెనుక గన్‌మేన్‌లు కూర్చు న్నారు. కారు బయలుదేరింది.

స్టీరింగ్ పక్కన దేవుని బొమ్మ దానిపక్కన



యస్వీ రంగారావుతో ముకుందరావు ఫోటో వుంది.

దానికి ముకుంద రావు మొక్కి ... "గురువుగారు! మీ నటనా స్ఫూర్తితో ఇంతఎత్తుకు ఎదిగాను. నవరస నాటక అకాడమి స్థాపించి, అప్పుడప్పుడు ఇలాంటి గెటప్స్ వేసి, సహజమైన పాత్రకు సరిపోయానో లేదో పరీక్షించుకుంటూ ఉండడం నా అలవాటులో భాగంగా ఈ రోజు పెళ్ళిలో మంత్రి పాత్రకు ఇంత స్పందన వచ్చిందంటే ఇక నాకు తిరుగేలేదు!" అన్నాడు.

"నిజమే సార్! మమ్మల్ని కూడా నిజమైన సెక్యూరిటీ అనుకున్నారు. భలే జీవించాం కదూ!" అన్నాడు ఒకడు.

"సార్ ! ఇక కొంచం దారిలో కారు ఆపితే ... ఉడికి పోతున్న ఈ సెక్యూరిటి డ్రస్ తీసి మామూలు డ్రస్ వేసుకుంటాం!" అన్నారు.

అందరు హాయిగా నవ్వుకున్నారు.





# నెల నెలా నవ్వుల వెన్నెల





ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా ఒక అంశం మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- బద్ధకం


























చౌకగా దొరికిందని, పిల్లలు అమెరికా నుంచి వస్తున్నారని, ఇంత తేవాలా?వాళ్ళకి **బద్ధకం ఉంది కాబట్టి దీన్ని వాడేది తక్కువే.
TOILET PAPER
ప్రసిద్ధ



నీ బద్ధకం తగలెయ్యా..
నీగుడ్లు నువ్వే పొదగవచ్చు కదా?
చాల్లే!
నా అందం
పాడైపోదూ?


దయచేసి సీరియల్స్ మోజులోపడి మీ భర్తల్ని అశ్రద్ధ చేయకండి.... వారి ఉసురు మాకు తగుల్తుంది...


'అతిబద్ధకశ్రీ' అవార్డుని వాళ్ళింటికే వచ్చి ఇచ్చుకోమంటున్నాడు... మనం సెలెక్ట్ చేసిన పెద్దమనిషి!


'మావాడికి కొస్త బద్ధకం ఎక్కువంటె' సర్లే అనుకున్నాం కదా, ఇప్పుడు కూడానా?!'


అయ్యో.... అయ్యో.... మళ్లీ పడ్డారా.....
లేదే... ఉదయం పడిందే..... లేవడం... మళ్లీ పడడం...... మళ్లీ లేవడం ఎందుకనీ... ...


మా రాజు బద్ధకం మహారాజా బద్ధకం ఊరంతా తిరిగినా గోరంతా తగ్గదు ఓహోం ఓహోం హోం .........
Mani


ఏళ్లతరబడి కోమాలోఉన్న నన్ను ఇప్పుడేగా లేపావు! బాగా బద్ధకంగా ఉంది.. కాసేపాగు వస్తాను!!
సుందరం

# పుట్టినిల్లు



బొందల నాగేశ్వరరావు,
9500020101

**ఆటో దిగింది అమృతవల్లి.**

**ఆటో వాడికి డబ్బులివ్వబోతూ– "అబ్బాయ్!... ఆ సూట్ కేసును కాస్త గుమ్మం వరకు తీసుకురా!" ఆర్డరేస్తున్నట్టు అంది.**

**"ఎంటీ... ఆటోలో నువ్వొచ్చినందుకేనమ్మా కిరాయి. నేను సూట్ కేసును మొయ్యటానిక్కాదు!" అన్నాడా ఆటో అతను.**

"అయితే పైసలివ్వనబ్బాయ్! సూట్ కేసును గుమ్మం వరకు తెస్తే ఇస్తాను. లేకుంటే ఎంతసేపైనా నేనూ ఇలాగే ఇక్కడే వుంటాను!" మొండికేసి డబ్బును గుప్పెట్లోనే పెట్టుకొంది అమృతవల్లి.


"ఉదయాన్నే భలే గిరాకి... పదండి!" అంటూ సూట్ కేసును గుమ్మం వరకు తీసుకువెళ్ళాడు ఆటోవాడు.

"ఇందా డబ్బులు!" అని డబ్బులివ్వగానే... గొణుక్కొంటూ వెళ్ళి పోయాడు ఆటోవాడు.

కాలింగ్ బెల్లు నొక్కింది అమృతవల్లి.

తలుపుతెరిచి చూసి షాక్ తిన్నాడు అన్నయ్య అమర్నాథ్.

"అరేయ్ అన్నయ్యా!... ఏంటి షాక్ తిన్నట్టు అలా అయిపోయావు. నేనురా! నీ చెల్లి అమృతవల్లిని!" అన్నయ్య షర్టును పట్టుకొని కుదిపింది అమృతవల్లి.




షాకునుంచి తేరుకొని– "ఏంటి షడన్‌గా దూకావ్?!... గత నెల్లోనే కదే వచ్చి వెళ్ళావ్!... ఇంతలోనే మళ్ళీ నువ్వు మీ ఆయన దెబ్బ లాడుకున్నారా?" కుతూహలంతో నవ్వుతూ అడిగాడు అమర్నాథ్.

"ఛీ!... ఎందుకలా వూహిస్తావు? మేమిద్దరం చిలుకా గోరింకల్లా చక్కగా సంసారాన్ని సాగిస్తున్నాం. కాకపోతే పెళ్ళయి పదేళ్ళయినా నా కడుపు పండలేదు. అదే మా దిగులు. సౌత్ ఇండియాలో వున్న గుళ్ళన్నీ తిరిగి కనబడ్డ దేవుళ్ళందరికి మొక్కుకున్నాం రా అన్నయ్యా!" అంది.

"గుళ్ళకు తిరిగితే పిల్లలు పుట్టరే పిచ్చి మొహమా! బావ, నువ్వు కలిసి ఇంట్లో వుండాలి. ఇలా ఇద్దరూ వూర్లు పట్టుకు తిరగ్గూడదు!" నవ్వుతూ అన్నాడు.

కోపం వచ్చింది అమృతవల్లికి.

"సరే! నువ్వు అడ్డులే లోనికెళ్ళాలి. ఈ సూట్ కేసును తీసుకెళ్ళి ఆ గెస్టు రూంలో పెట్టు!" అంటూ వెళ్ళి సోఫాలో కూర్చొంది అమృతవల్లి.

"ఇంత పెద్దదానివైనా నీలోని సోమరితనం, బద్ధకం అస్సలు పోలేదు. నీకు తగ్గట్టు నీ మొగుడు కూడా బద్ధకస్తుడే! వాడెవడో...ఎదరే వున్న చెంబులోని నీళ్ళు తీసుకు తాగలేక పనోడిని పిలిచి తాపించమన్నాట్ట. అలా వుంది మీ వ్యవహారం... ఇంతకు ఎందుకొచ్చినట్టు?..." ప్రశ్నించాడు.

"ఏమీలేదురా అన్నయ్యా! మా వారికి కంపెనీలో ఓ నెల 'లే ఆఫ్' ఇచ్చారు. ఇద్దరం ఇంట్లో ఒకరినొకరు చూసుకొంటూ వుండలేక... వారు వాళ్ళింటికి... నేను నా పుట్టింటికని వచ్చేశాం!"

"పుట్టిల్లా!...నీకు పుట్టిళ్ళంటే మనిల్లు... అక్కడికెళ్ళకుండా ఇక్కడి కెందుకొచ్చావ్?"

"ఇది నాఅన్నయ్య ఇల్లు. అంటే నాకు పుట్టింటితో సమానం! అందుకే వచ్చాను" గోముగా అంది.

"అంటే ఇద్దరూ ప్లాన్ చేసుకొని పది రోజుల పాటు తిండి ఖర్చులు, శ్రమ తగ్గించుకోవచ్చునన్న వుద్దేశ్యంతో చెరో వేపుకు వచ్చారన్నమాట!"

"నువ్వేమైనా అనుకో...ఇది నా అన్నయ్య ఇల్లు కనుక పది రోజుల పాటు రెస్టు తీసుకొని వెళ్ళిపోతాను!" అని అంటుండగా బెడ్ రూంలో నుంచి...

"ఏమండీ! కాస్త ఇటొచ్చి వెళ్ళండి!" అని దగ్గుతూ పిలిచింది అమర్నాథ్ భార్య గిరిజ.

"ఆc...వస్తున్నా! మీ వదిన పిలుస్తోంది. మళ్ళీ వస్తాను!" అంటూ వెళ్ళి వెంటనే తిరిగొచ్చాడు.

"అదేంట్రా అన్నయ్యా!... నేనొచ్చి పావుగంటై య్యింది. వొదినొచ్చి మంచి కాఫీ పెట్టివ్వొచ్చు కదా!" గోముగా అడిగింది అన్నయ్యను.

"తను రాలేదు. దానికి బాగా జ్వరం. నువ్వెళ్ళి కాఫీ పెట్టుకొని తాగి... నాకు తనకు తీసుకురా వెళ్ళు!... అలాగే మధ్యాహ్నానికి పప్పు, దుంపల

వేపుడుతో వంట కూడా చెయ్యి... ప్లీజ్!" అన్నాడు.

"ఏం(టా... నేనా!" ఆశ్చర్యంగా అడిగింది అమృతవల్లి.

"తప్పదు !నీ అన్నయ్యకోసం చేసి పెట్టవూ ప్లీజ్! మీ వదినకు జ్వరం తగ్గగానే తనే చేసు కొంటుందిలే !" చెయ్యపట్టుకొని లాగి వంట గదిలోకి నెట్టాడు చెల్లెల్ని.

చేసేది లేక... స్టవును వెలిగించింది అమృత వల్లి.


అమృతవల్లి... సోమరితనం ఒక్కటిగా పుట్టారా అన్నట్టు, తన సోమరితనం వల్ల తను చేసుకోవలసిన పనులను... అమ్మ, నాన్న, అన్నయ్యల చేత (పేమతో లేక దబాయిం పులతో చేయించుకుంటుంది.

తనకంటూ తను చేసుకునే పనులు మూడే! అవి ఏమిటంటే... తినటం, టీవీని చూడ్డం, నిద్రపోవటం.

అలా ఒల్లు కదలకుండా (బతికిన అమృత వల్లి అత్తగారింటికి వెళ్ళిన తరువాత అక్కడ ఆమె పాచికలేవీ పారకపోయేసరికి భర్తను చిక్కించుకొని, అతన్ని తనకు అనుకూలంగా మలుచుకొని తన అందచందాలను ఆరబోసి, తియ్యటి కబుర్లతో లొంగదీసుకుని కాలాన్ని నెట్టుకొస్తూ వుంది.

అలాగే... ఇలా ఎప్పుడైనా భర్తకు వాళ్ళ ఫ్యాక్టరీలో 'లే ఆఫ్'ను ప్రకటిస్తే... అటు తల్లి గారింటికో ఇటు అన్నయ్య ఇంటికో వచ్చే






స్తుంది. వున్నన్నాళ్ళు బాగా తింటూ... టీవీని చూస్తూ, నిద్రపోతూ కాలాన్ని గడపడమే కాక తిండి ఖర్చులు, చేసుకు తినే శ్రమను ఆదా చేసుకొని ఆనందంగా వెళ్ళిపోతుంది.

ఈసారి అలా కుదరలేదు.

అమృతవల్లి ఎత్తుకు పైఎత్తు వేసి జ్వరం సాకులో మంచమెక్కింది వదిన గిరిజ.

ఇక తనకు అన్నయ్య ఇంట వంట చేయక తప్పలేదు.

"అమృతా... కాస్త ఇటు రా!" వదిన కేకేసింది గదిలోనుంచి.


తను పెట్టుకున్న కాఫీని గటగట తాగేసి...

"వస్తున్నా!" అంటూ గదిలోకి వెళ్ళింది.

"ఆ మందులిటివ్వు!" కళ్ళతో చూపుతూ అడిగింది వదిన.

"అలాగే!" అంటూ మందులను అందించి కిచ్చన్లోకి వెళ్ళబోయింది అమృతవల్లి.

"ఆగు అమృతా! ఎటూ వచ్చావు కనుక ఈ నెల ఇక్కడే వుండిపో! మరో విధంగా అనుకోకు... నిజం చెప్పాలంటే మా పనిమనిషి మానేసింది... నాకు జ్వరం తగ్గినా నీరసంతో ఏ పనీ చేసుకోలేను. మీ అన్నయ్య, పిల్లలు అస్సలు చెయ్యరు. హోటలు భోజనం మాకు పడదు. అందుకే అడుగుతున్నాను!" అంది.



'అంటే నన్ను ఓ నెల రోజులు పనిమనిషిగా వుంచేసుకోవాలనుకొంటోందన్నమాట. చస్తే వుండను. అసలదెలా కుదురుద్ది. నేనే సోమరి నంబర్ ఒన్! ఒక్కోసారి మావారు నా బద్ధకాన్ని గమనించి నా బ్రష్‌కు పేస్టు కూడా వారే వేసి స్తారు... అలాంటిది ఓ నెలుండి ఈవిడకు చాకిరి చెయ్యాలా! నో!!... ఎట్టి పరిస్థితుల్లోనూ కుదరదు... కాని ముఖం మీదే ఎలా చెప్పనూ! పోనీ...ఇప్పటికి ఒప్పుకుందాం' అని మనసులో అనుకొని–


"అలాగే వదినా!... వారు రమ్మనే వరకూ నేను వెళ్ళనులే!" అంటూ కిచన్లోకి నడిచింది.


పదిహేను రోజులు గడిచాయి.

అన్నయ్య ఇంట్లో హాయిగా తింటూ, టీవీని చూసుకొంటూ నిద్రకు మాత్రం పరిమితమవ్వాలనుకొని వచ్చిన అమృతవల్లి నిత్యం బోలెడంత చాకిరి చేయటంతో సగమైయ్యింది... అప్పుడప్పుడు తనలోని ఓర్పు, సహనాలను కోల్పోయి కోపాన్ని తెచ్చుకొని పళ్ళతో పెదాలను కొరుక్కొంటోంది...

ఆ కోపం కాస్త అన్నయ్య, వదినల ముందు బరస్టు అవక ముందే ఎలాగైనా వెళ్ళిపోవాలన్న నిర్ణయానికి వచ్చింది. అందుకు ముహూర్తం రేపేననుకొంది.

మరుసటి రోజు ఉదయం అన్నయ్య వదినలు హాల్లో కూర్చొని కబుర్లు చెప్పుకొంటూ




నవ్వుకొంటున్నారు.

ఆ సన్నివేశాన్నిచూడలేకపోయింది అమృతవల్లి.

కాఫీ ట్రేతో వచ్చి– "తీసుకొండి!" అంది ఇద్దరిని కొరకొరా చూస్తూ.

"ఏంటి అమృతా! అదోలా వున్నావ్? నువ్వూ కాఫీ తీసుకో!" అన్నాడు అన్నయ్య.

టపీమని కాఫీ ట్రేని టీపాయి మీద పెట్టి... బొడ్లో దోపుకున్న ఫోన్ను చేతికి తీసుకొని బట్టన్ నొక్కి–

"హల్లో!... అప్పుడే ఇంటికొచ్చేశారా! ఓకే...అయితే నేనూ బయలుదేరి వస్తానండి." అంటూ ఫోన్ ఆఫ్ చేసి...

"అన్నయ్యా! వారు ఇంటికొచ్చేశారట! రమ్మంటున్నారు. ఆటోని పిలిపించు. నేను వెళ్ళాలి!" అంటూ చల్లారిన కాఫీని గొంతులో పోసుకొని ట్రేని కిచ్చన్లో పెట్టి అయిదు నిముషాల్లో తయారై వచ్చి సోఫాలో కూర్చొంది అమృతవల్లి.

ఆటో వచ్చింది. ఎక్కి కూర్చొని– "అన్నయ్యా...వదినా! వెళ్ళొస్తాను..." అని చెయ్యి వూపుతుండగా... ఆటో కదిలింది.

"నిజంగా వాళ్ళాయన రమ్మనుంటారాండీ?" సందేహంతో అడిగింది భార్య గిరిజ.

"నో!... బావగారితో రాత్రే మాట్లాడాను. రావటానికి మరో పది రోజులు పడుతుందట. అమృతే... మనింటి చాకిరికి తట్టుకోలేక వెళ్ళిపోతోంది. ఇక ఇక్కడికి రాదు. తిన్నగా మా ఇంటికే వెళుతుంది!" అన్నాడు అమర్నాథ్ నవ్వుతూ.

## హాస్య బ్రహ్మలు

ప్రభాకర్ అంతోటి






**జీ**వితంలో వచ్చిన అనేక ఒడిదుడుకులను తన మాటకారితనంతో తప్పించుకోవడంలో, హాస్యాన్ని సృష్టించడంలో దిట్ట– శ్రీ తిక్కవరపు రమణారెడ్డి. నెల్లూరు జిల్లా జగద్దేవిపేటలో 1921 అక్టోబరు 1న జన్మించారు రమణారెడ్డి.

సన్నగా, నిటారుగా, వెదురుకర్రకి వేలాడుతున్న రెండు చేతులు తగిలిస్తే ఆ రెండు చేతులు తోలుబొమ్మల చేతుల్లా కదిలిస్తూ... నెల్లూరు మాండలిక భాష మాట్లాడేస్తూ నవ్వులు కురిపించే, ఆయన కచ్చితంగా హాస్యనటులకు ఓ కేరాఫ్ అడ్రస్.

1951లో వచ్చిన 'మాయపిల్ల' చిత్రంలో తొలిసారిగా వేషం వేసారు రమణారెడ్డి. ఆ సినిమా ఆశించిన విజయం అందకపోవడంతో అవకాశాలు ఆయనకు రాలేదు. అదే సమయంలో కొన్ని చిత్రాలకు డబ్బింగ్ చెప్పారు.

1954లో వచ్చిన బంగారుపాప అనే చిత్రంతో రమణారెడ్డి మంచి నటుడిగా ఋజువు చేసుకున్నారు. ఈ చిత్రంలో ముక్కుతో మాట్లాడి హాస్యాన్ని పలికించారు.

1955లో వచ్చిన మిస్సమ్మతో రమణారెడ్డి హాస్యనటుడిగా స్థిరపడ్డారు.

ఎక్కువ శాతం కామెడీ విలన్ వేషాలతో ప్రేక్షకులని నవ్వించడంలో సఫలీకృతులయ్యారు.

మేజిక్ విద్య కూడా తెలియడం వలన అనేక ప్రదర్శనలిచ్చి ఎన్నోసార్లు విరాళాలు సేకరించి దానాలు చేసారు.

1974 నవంబరు 11న ఒక మంచి హాస్య నటులు తెలుగు ప్రేక్షకులకు దూరమయ్యారు.

# మళ్ళీ మొదలు!



కె.వి.సుమలత,
9492656255

**బంగారానికి బంగారమంటే బంగారమంత ఇష్టం.**

**నూరు కాసుల బంగారం అమరేదాకా పిల్లలు వద్దంటే వద్దు అని మంగమ్మ శపథం చేసింది.**

**"పిల్లలు ఆలస్యంగా పుడితే అందరూ ఏమయినా అనుకుంటారేమో బంగారం!" నసిగాడు సింగారం.**

"ఎవరయినా ఏమైనా అనుకోనివ్వండి! నేను మాత్రం నా పట్టు వదలను!" అంది బంగారం.

చేసేదేమి లేక బంగారానికి బంగారం అమర్చడానికి ప్రయత్నం చేస్తున్నాడు సింగారం.

ఓ శుభదినాన నూరుకాసులు పూర్తయిన సందర్భం పురస్కరించుకొని ఇంటి దగ్గరలో ఉన్న కల్యాణమండపంలో ఎవరిదో పెళ్ళి జరుగుతుందని తెలిసి, అదే సరయిన అవకాశం నగల ప్రదర్శన చెయ్యడానికి అనుకుంది బంగారం.

"మనం ఆ పెళ్ళికి వెళ్దాం!" అని సింగరంతో చెప్పింది బంగారం.

"ఎందుకే పిలవని పేరంటానికి వెళ్ళడం?" నసిగాడు సింగారం.

"మళ్ళీ నస మొదలు పెట్టారా? ఓ నూట పదహార్లు చదివించి... భోజనం చేసి వద్దాం!"... హుంకరించింది బంగారం.

మారు మాట్లాడకుండా గంగిరెద్దులా తల ఆడించాడు సింగారం.

మండపం లోకి వెళ్ళగానే– "రండి రండి! ఇంత ఆలస్యమైందేంటి?" అంటూ ఓ మహాలక్ష్మి ఎదురొచ్చింది.

బంగారాని కన్నా 'ఎక్కువ' నగలు అలకరించుకోవడం బంగారానికి నచ్చలేదు కాని– "రండి రండి" అనడం నచ్చేసి 'చూసారా? ఇదంతా నా నగల ప్రభావం' అన్నట్లు సింగారం వైపు చూసింది.

"ఆవిడ ఎవరో అనుకొని పొరపాటు పడుతుందేమోనే!" మళ్ళీ నసిగాడు సింగారం.

మళ్ళీ మొదలెట్టాడు నస అన్నట్లు బంగారం ఉరిమి చూసింది.

మహాలక్ష్మి బంగారం చేయి పట్టుకొని తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టింది.

బంగారం తన నగలు సర్దుకుంటూ అటూ ఇటూ చూసింది అందరి వైపు.

కానీ ఎవరూ తన వైపు చూస్తున్నట్లు లేదు... అందరూ మహాలక్ష్మి వైపే చూస్తున్నారు అనిపించింది

అక్కడున్న ఆడవాళ్లందరితో చాలా కలివిడిగా మాట్లాడుతూ... ఒక్కొక్కరితో సెల్ఫీలు తీసుకుంటూ చాలా సందడి చేస్తుంది మహాలక్ష్మి.

బంగారం వంతు వచ్చింది...'రండీ' అని బంగారం చేయి పట్టుకొని లేపింది మహాలక్ష్మి...

"మీ రవ్వల హారం అదిరిపోతుంది సుమా! కెంపుల నెక్లెస్ అయితే మరీ బాగుంది సుమండీ!" బంగారంతో అంది మహాలక్ష్మి.

ఇద్దరితో కలిపి రెండు సెల్ఫీలు తీసుకుంటూ "చూడండీ! ఫోటోలో ఎంత మెరిసిపోతున్నాయో...వాటి కాంతి మీ ముఖంలో పడుతుంది కదూ!" అంది మహాలక్ష్మి.

అబ్బా!... అప్పుడు చూడాలి బంగారం ముఖం... మురిసిపోయి మెరిసిపోతూ మెలికలు తిరిగిపోయింది.

వాళ్ళను నోరు తెరిచి చూస్తున్నాడు సింగారం.





"మీరేమీ అనుకోనంటే... మీ గుర్తుగా నేను వాటిని వేసుకొని ఒక ఫోటో దిగి ఇస్తాను. నా కాసుల పేరు, పగడాల పట్టీ మీరు వేసుకోండి. మీ చంద్రవంక పక్కన నా సూర్యవంక పెట్టుకోండి. సరేనా?" బంగారంతో అంది మహాలక్ష్మి.

మహాలక్ష్మి పొగడ్తలకు మురిసిపోయిన... బంగారం– "సరే దానిదేముంది?... అలాగే చేద్దాం!' అంటూ తన నగలు ఒలిచి ఆవిడకి ఇచ్చి ఆవిడ నగలు తను వేసుకుని ఫోటోలకి ఫోజులిచ్చింది.

ఏంటండి!... ఈ మహా నటన! కనుగుడ్లు పొడుచుకుని బయటకు వచ్చేస్తాయి అన్నట్లు చూస్తున్నాడు సింగారం.

"మనం కలిసి భోజనం చేయడానికి వెళ్దాం



పదండి!" అంటూ గబా గబా డైనింగ్ హాల్ వైపు బంగారం చేయి పట్టుకొని తీసుకెళ్ళింది మహాలక్ష్మి.

సింగారం వాళ్ళ వెనుకనే నక్కి నక్కి వెళ్ళాడు మొహమాటంగా.

అంతలో మహాలక్ష్మి బంగారాన్ని కుర్చీలో కూర్చో బెట్టి... "ఇప్పుడే వస్తాను ఉండండి!" అంటూ బయటకు వెళ్ళింది.

"అయ్యో! నీ రవ్వల హారం, కెంపుల నెక్లెస్ వెళ్ళిపోతున్నాయి బంగారం!..." సింగారం కేక పెట్టాడు.

"ఆవిడ ఈ పెళ్లి పెద్ద అని తెలుస్తూనే ఉంది. దానికి తోడు నేనిచ్చింది రెండు ఆవిడ ఇచ్చింది మూడు నగలు!"... తాపీగా అంది బంగారం.

"ఒకవేళ అవి గిల్టువి అయితే..." నసిగాడు సింగారం.

"అదుగో! మళ్ళీ నస మొదలు పెట్టారు!!" అంది బంగారం.

"అవును బంగారం! అవి బంగారం కాక పోతే?..." మళ్ళీ నసిగాడు సింగారం.

బంగారం లేచి మండపంలోకి పరుగెత్తింది.

ఎక్కడా మహాలక్ష్మి జాడ కనిపించలేదు.

అక్కడున్న అందరినీ మహాలక్ష్మి గురించి అడిగింది.

"ఎవరో పెద్దావిడ ఇప్పటి దాకా చాలా సందడి చేసింది... ఒంటినిండా నగలతో అచ్చు మహాలక్ష్మి దేవిలా!..." అన్నారందరు.

"అంటే ఆవిడ ఈ పెళ్లివారి ఇంటి మనిషి కాదా?" కంగారుగా అడిగింది బంగారం.

"అదేంటి? మీకు ఈ పెళ్లివారు ఎవరో తెలియదా? అలా అడుగుతున్నారు?..." తిరిగి ప్రశ్నించారు ఎవరో.

బంగారం ముఖం నల్లగా మాడిపోయింది.

నెత్తిన చెయ్యి పెట్టుకొని అక్కడే చతికిలపడింది.

"మళ్ళీ నూరు కాసులా?" తను కూడా నెత్తిన చెయ్యి పెట్టుకున్నాడు సింగారం.

# షణ్మాతృకల సన్మానంలో పులకించిన అక్షజ్ఞ!



**క**ళారంగంలో పులకించాలని, అక్షరార్చనతో ఆరంభించాలని 'అక్షజ్ఞ పబ్లికేషన్స్' ప్రారంభించిన శ్రీ వెంకట్‌గారు ఈ యేడాది ఉగాది పురస్కారోత్సవాన్ని నిర్వహించారు.

మార్చి,26న హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశ మందిరంలో– షణ్మాతృకలకు (ఆరుగురు మహిళలు) ఉగాది పురస్కారాలతో సత్కరించారు.

శ్రీ దైవజ్ఞ శర్మ, శ్రీ ఓలేటి పార్వతీశం, శ్రీమతి ముక్తేవి భారతి, శ్రీ అక్కిరాజు సుందర రామకృష్ణ, శ్రీరాము.పి, శ్రీ వి.సుబ్బరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

శ్రీశుభకృత్ ఉగాది పురస్కారాలు అందుకున్న మహిళామణులు– **శ్రీమతి అనంతలక్ష్మి**– ఆధ్యాత్మిక ప్రవచనం, **శ్రీమతి అనూరాధ తడకమళ్ళ**–నృత్యం, **శ్రీమతి సాయని విజయభారతి**–న్యాయవాది, ప్రజ్ఞాభారతి ఉపాధ్యక్షురాలు, **శ్రీమతి పావని ముట్నూరి(పసుమర్తి)**– కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యగాయని, **శ్రీమతి జ్యోతి వలబోజు**– ప్రచురణ, **శ్రీమతి ప్రఖ్యా జయశ్రీ**– కర్ణాటక సంగీత గురువు.

శ్రీ బ్నింగారు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, శ్రీ బి.ఎస్. శర్మగారు సభని నిర్వహించారు.

అక్షజ్ఞ ప్రచురణ కర్తలు శ్రీమతి & శ్రీ విద్యా వెంకట్ గారు ఎంతో శ్రద్ధతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరి మన్ననలు పొందింది.

పురస్కారగ్రహీతలకు వారి వారి సన్మాన పత్రాలను పుస్తక రూపంలో ప్రచురించి ఇవ్వటం విశేషం!

# విశాఖపట్నంలో– కార్టూన్ ఫెస్టివల్ 2023




కార్టూన్ ఫెస్టివల్–2023, మార్చి,25,సాయంత్రం, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన **కార్టూన్ వాచ్** ఛీఫ్ ఎడిటర్ శ్రీ త్రయంబక్ శర్మగారి ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని మేఘాలయా హోటల్‌లో జరిగినది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నం నగర మేయర్ శ్రీమతి గొలగాని హరివెంకటకుమారి గారు, ఛత్తీస్‌ఘడ్ టూరిజం బోర్డు యం,డి, శ్రీఅనిల్‌కుమార్ సాహుగారు మరియు ఆంధ్రాయూనివర్శిటీ డిపార్టుమెంట్ ఆఫ్ జర్నలిజం ఛైర్మన్ శ్రీ డి.వి.ఆర్.మూర్తిగారు హాజరయారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ కార్టూనిస్టులు శ్రీ బాలి గారిని, శ్రీహరి వెంకట్ గారిని మరియు శ్రీ టీవీ గారిని జీవితసాఫల్య పురస్కారములతో సత్కరించారు.

తదుపరి విశాఖపట్నం స్పెషల్ సంచికగా కార్టూన్ వాచ్ మార్చి 2023 సంచికను ఆవిష్కరించారు.

నార్త్ కోస్టలాంధ్ర కార్టూనిస్ట్స్ ఫోరమ్ ఆధ్వర్యవంలో శ్రీ త్రయంబక్ శర్మగారిని మెమెంటోని అందజేసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. శ్రీ బాలిగారు తన పెయింటింగును శర్మగారికి బహుమతిగా ఇచ్చారు.

శ్రీ ఆరిశెట్టిసుధాకర్ దంపతులు శ్రీ శర్మగారిని ప్రత్యేకంగా సన్మానించారు.

ఈ కార్యక్రమానికి –సర్వశ్రీ బాలి, టీవీ, హరివెంకట్ , బాచి, నాగిశెట్టి, గౌతమ్, లాల్, రామశర్మ, టి.ఆర్.బాబు, జగన్నాథ్, బి.యస్.రాజు, దంతులూరి వర్మ, ఆరిశెట్టి సుధాకర్, యం.యం. మురళి, ప్రేమ్ , శంబంగి, కొడాలి సీతారామారావ్ , వందనశ్రీనివాస్, నల్లపాటి సురేంద్ర, కశ్యప్, ఓంకార్ లు హాజరయారు.

కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు శ్రీ త్రయంబక్ శర్మగారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇటువంటి కార్టూన్ ఫెస్టివల్ ను విశాఖపట్నంలో ఏర్పాటు చేసినందుకు అందరూ ధన్యవాదాలు తెలియజేశారు.

**–సదాశివుని లక్ష్మణరావు**




గంగాధర్ వడ్లమన్నాటి-
9908445969

## రెండో 'సారి

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

తర్కారావ్ కాస్త గొంతు సవరించుకుని- "ఓసారి వెంగళరావ్, మార్నింగ్‌వాక్ చేసి, చేసి అలసి పోయాడు. సరే అని ఆ పక్కన ఉన్న ఓ సిమెంట్ బెంచి మీద కూర్చున్నాడు. అతని పక్కన ఓ ముసలాయన కూర్చోవడం చూసి- 'ఈ వయసులో ఇతను వాకింగ్ చేస్తున్నాడా?' అని మనసులో అనుకుని పలకరింపుగా "హలో" అంటూ నవ్వాడు.

అతను కూడా "హలో" అని నవ్వాడు.

తర్వాత నీళ్ళ బాటిల్ తీసాడు. కానీ నీళ్ళు లేవు.




"అరే వాకింగ్ తక్కువ చేసి నీళ్ళు ఎక్కువ తాగేస్తున్నానా ఖర్మ!" అనుకుంటూ ఆ బాటిల్‌ని పక్కన పెట్టేసాడు.

ఇంతలో అతని పక్కన కూర్చునతను తన వాటర్ బాటిల్ తీసి "తాగండి!" అంటూ అందించాడు.

తీసుకుని "థ్యాంక్స్!" అంటూ గట గటా తాగేసాడు.

తరువాత మూతి తుడుచుకుని- "మీరూ ఇక్కడే వాకింగ్ చేస్తారా?" అడిగాడు వెంగళరావ్.

దానికతను చిన్నగా నవ్వుతూ- "లేదు! నేను కాదు నా మనవరాలు చేస్తుంది. నేను ఆమెతో పాటు వస్తుంటాను." చెప్పాడతను.

"అలాగా!" అని అప్పుడే పరిగెత్తుకుంటూ వస్తున్న ఒకర్ని చూసి... "చూసారాండీ వాడ్ని! ఆ జుత్తూ, చిరిగిన జీన్సూ, టోపీ, వాడి వాలకం... ఈ కాలం పిల్లలు ఎలా తయారయ్యారు!" అన్నాడు బాటిల్ ఇచ్చేస్తూ.

దానికతను కాస్త కోపంగా చూస్తూ- "మిస్టర్! ఆ వచ్చేది అబ్బాయి కాదు... అమ్మాయి! ఆమే నా మనవరాలు!!" అన్నాడతను కొంత అసహనంగా చూస్తూ.

దాంతో గొంతులో పచ్చి వెలక్కాయ్ పడ్డట్టు మొహం పెట్టి... ఎలా అయినా కవర్ చేయాలని- "అవునవును, ఇప్పుడు ఇలా తయారవ్వడమే ఫ్యాషన్! నేనే గ్రహించలేకపోయాను. కాస్త పాత తరం వాడిని కదా అందుకే అలా పొరబడ్డాను. కానీ నేను అలా అన్నా మీరు నన్ను కోప గించుకోలేదు. మీరు గ్రేట్ !" అన్నాడు వెంగళరావ్ అతనితో.

దానికతను, "నేను మొదటి తప్పుకి లేదా పొరబాటుకీ ఎవర్నీ ఏవీ అననండీ. కానీ రెండో తప్పుకి మాత్రం క్షమించలేను. చేయి చేసు కుంటాను!" చెప్పాడతను.

"అలాగా! మంచి అలవాటు. మీరు ఆమెకి ఓ మంచి తాతయ్య సార్!" అంటూ తన బాటిల్ తీసుకున్నాడు వెంగళరావ్.

అంతే! అతను కోపంతో- "యూ రాస్కెల్!!" అంటూ పైకి లేచి వెంగళరావ్ చెంప పగలకొట్టాడు.

దానికి బిత్తరపోయిన వెంగళరావ్, తెల్లమొహం వేసుకుని చూస్తూ, "ఎందుకు నన్ను ఇలా చేయి చేసుకున్నారు?!" అడిగాడు బేలగా చూస్తూ.

వెంగళరావ్ ప్రశ్నకి "నీకు ముందే చెప్పానుగా రెండో తప్పుకి క్షమించనని... అందుకే కొట్టాను!" అని... అసలు విషయం చెప్పడంతో, 'సారీ' చెప్పి బిక్కమొహం వేసాడు వెంగళరావ్.

"ఇప్పుడు చెప్పు సుబ్బారావ్! వెంగళరావ్ చేసిన రెండో తప్పు ఏవిటీ? ఆ వ్యక్తి చేయి చేసుకునేంత పొరపాటు ఏం చేసుంటాడు?" అడిగాడు తర్కారావ్.

"సింపుల్ సార్! అతని వాటర్ బాటిల్ అనుకుని, ఆ పక్కన కూర్చున్న వ్యక్తి వాటర్ బాటిల్ తీసుకునుంటాడు. దాంతో ఆ వ్యక్తి చేయిచేసు కోవడం జరిగింది అంతేనా సార్!" అడిగాడు నమ్మకంగా.

"కాదు తమరి బొంద! వెంగళరావ్ పక్కన కూర్చున్న వ్యక్తి అతనను కున్నట్టు మగాడు కాదు... స్త్రీ! ఆమెని పట్టుకుని మీరు మంచి తాతయ్య అనేసరికి ఆమెకి కోపం వచ్చి చేయిచేసుకుంది. దాంతో ఆమెకి సారీ చెప్పి అక్కడినుండి కదిలాడు వెంగళరావ్... నువ్వు చెప్పలేక పోయావు కనుక ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు!" అని తర్కారావు చెప్పగానే...

"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్ధం చేసుకోరు కదా!..." అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావ్.

**జులై 2017 హాస్యానందంలో మొదలైన 'తార్కారావు కథలు' శీర్షికలో... 50వ కథ ఇది.**

# ఫైనల్ రిజల్ట్

బుద్ధవరపు కామేశ్వరరావు,
98480 47322

**"డాక్టర్ గారూ! కవర్ లోని ఈ రిపోర్ట్స్ చూడండి.... సార్... ఈవిడ కండీషన్ చాలా సీరియస్ కదా?"**

**"ఔనమ్మా! ఇది కొంచెం సీరియస్ కేసే. అయినా ఎందుకు అలా అడిగారు?"**

"ఊరికే.... తెలుసుకుందామని!"

"ఏమైనా ఆస్తి పంపకాలు లాంటివి ఉంటే ఇప్పుడే తేల్చుకోవడం బెటర్ కదా?"

"ఔనమ్మా! కానీ ఎందుకు అలా అడిగారు?"

"ఊరికే.... తెలుసుకుందామని!"

"ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే అడగండి..."

"ఇంక ఈవిడకు ఏ మందులూ కూడా పనిచేయవు కదా? డాక్టర్!"

"వాడినా పెద్ద ఉపయోగం ఉండదమ్మా! అయినా దేనికి అడిగారు?"

"ఊరికే.... తెలుసుకుందామని!"

"చూడండమ్మా! మీ సందేహాలు తీరాయా?"

"డాక్టర్ గారూ! ఈవిడ ఇంకా ఎన్నాళ్లు బతకవచ్చు అంటారు?"

"ఎందుకలా అడిగారు?"

"ఊరికే... తెలుసుకుందామని!"

"పెద్ద వయసు కదా! బహుశా కొన్ని నెలలు అంతే!"

"మంచి విషయం చెప్పారు డాక్టర్ గారూ!"

"ఒహో! ఇప్పుడర్థమయ్యింది, అయితే ఈవిడ మీ అత్తగారామ్మా?"

"ఎందుకు అలా అడిగారు, డాక్టర్?"

"ఊరికే.... తెలుసుకుందామని!"

"ఔనండీ... ఈవిడ మా అత్తగారే!"

"మీ అత్తగారి పేరు పిల్లా ఆదిలక్ష్మి, ఔనా?"

"ఎందుకు అలా అడిగారు డాక్టర్?"

"ఊరికే.... తెలుసుకుందామని!"

"కాదండీ, మా అత్త పేరు పల్లా ఆదిలక్ష్మి!"

"మరి, పిల్లా ఆదిలక్ష్మి ఎవరు?"

"ఎందుకు అలా అడిగారు, డాక్టర్?"

"ఊరికే.... తెలుసుకుందామని!"

"ఏదైనా విశేషమా డాక్టర్?"

"చూడండమ్మా! ఈ కవర్ మీ అత్తగారిది... లోపలి రిపోర్ట్స్ పిల్లా ఆదిలక్ష్మి గారివి!"

✦✦✦

"ఒరే అన్నయ్యా! పిల్లా ఆదిలక్ష్మి అంటే మన అమ్మేనా?"

"చెల్లాయ్, ఎందుకు అలా అడిగావ్?"

"ఊరికే.... తెలుసుకుందామని!"

"ఔను అది అమ్మ పేరే. ఇంతకీ నీ డౌట్ ఏమిటే?"


"చెబుతాను, నువ్వు మన అమ్మని తీసుకుని నిన్న కానీ, ఈ తింగరీ దయగ్నాస్టిక్స్‌కి వచ్చావా?"

"ఔను వచ్చాము. అయినా ఎందుకు అలా అడిగావ్?"

"ఊరికే.... తెలుసుకుందామని!"

"ఔనా ? రిపోర్ట్స్ రెడీ అయ్యాయిటే. సాయంత్రం వెళ్లి తీసుకోవాలి"

"................................"



## 31,392 నగదు బహుమతులతో...

# కార్టూన్ పోటీలు

హాస్యానందం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కార్టూన్ పోటీలను విజయవంతం చేయాలని మనవి!




### కీ.శే.తోరహతుల వెంకటరత్నం శ్రీమతి వనజాక్షమ్మ దంపతుల పురస్కారం-2023

(వారి జ్ఞాపకార్థం వారి కుమారుడు,కోడలు అందిస్తున్నారు)

**నగదు బహుమతి-10,116/-**
**జ్ఞాపిక+ ప్రశంసాపత్రం**

5 ప్రత్యేక బహుమతులు

**నగదు బహుమతి-1,116/-**
**+**
**ప్రశంసాపత్రం**




### కీ.శే.తోరహతుల నాగేశ్వరరావు పురస్కారం-2023

(వారి జ్ఞాపకార్థం వారి తమ్ముడు,మరదలు అందిస్తున్నారు)

**నగదు బహుమతి-10,116/-**
**జ్ఞాపిక+ ప్రశంసాపత్రం**

5 ప్రత్యేక బహుమతులు

**నగదు బహుమతి-1,116/-**
**+**
**ప్రశంసాపత్రం**

2 పురస్కారాలు 10 ప్రత్యేక బహుమతులు

గమనిక:
- ✦ ఒకో కార్టూనిస్టు 3 కార్టూన్లు పంపవచ్చును.
- ✦ అసభ్యకరమైన కార్టూన్లు నిషేధం!
- ✦ క్యాప్షన్‌లెస్ కార్టూన్‌లకు ప్రాధాన్యత.
- ✦ క్యాప్షన్ ఉన్నా క్లుప్తంగా, ఏకవాక్యంలో ఉండాలి.
- ✦ 300 లో స్కాన్ చేసి మెయిల్ చేయాలి!
- ✦ విడివిడిగా ఎంట్రీలు పంపాలి.
- ✦ ఏ పురస్కారానికి పంపినది విధిగా రాయాలి.
- ✦ తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. వాదోపవాదాలకు తావు లేదు.

కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ: ఏప్రిల్,30, 2023

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను- hasyanandampoteelu@gmail.com

**ఫలితాలు జూన్,2023 హాస్యానందంలో ప్రచురించబడతాయి!**




**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె. ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలనుకుంటుంటాడు. ఆంధ్ర కుర్రాడు చందుని ఇష్ట పడుతుంది ఇందు. అయితే ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే ఇందునిచ్చి పెళ్ళి చేయాలనుకునేందుకు కారణం వంద సంవత్సరాల గతంలోకి వెళ్ళాల్సిందే... అలా వెళ్ళాక... సుబ్బారావు. అప్పన్నలు పోలీస్ ట్రైనింగ్ కోసం హైదరాబాద్ వెళతారు. గోల్కొండ కోట దగ్గర్నుంచి ఒక పొట్టి వ్యక్తి వీళ్ళను వెంబడిస్తుంటాడు. సుబ్బారావు, అప్పన్నలు ఒక పార్టీకి వెళతారు. అక్కడోహత్య జరిగి, ఒక నక్లెస్ దొంగిలించబుతుంది... పోలీసులు ఎన్‌క్వైరీ చేస్తుంటారు.

**ప్రస్తుతం...**

**"సరేనయ్యా! నోటి మాటతో పని అయిపోవడానికి ఇది మీ భారతీయ రాజుల కాలమా?... మా బ్రిటీష్‌వారి పాలన. అంతా...ఓ పద్ధతి ప్రకారం జరగాలి. అందులో రిటెన్ కంప్లైంట్ చాలా ముఖ్యం. ఎవరు... ఎప్పుడు... ఎక్కడ... ఎలా... ఎందుకు... దొంగతనం చేసారో వివరంగా రాసి పట్టుకురా...పో!" అన్నాడు జాక్సన్.**

**సుబ్బారావ్, సెల్యూట్ కొట్టి...తన దేరాకు వచ్చాడు.**

**సుబ్బారావు అవస్థ చూసి, రెండు కోతులు చెట్ల కొమ్మల్లో కూర్చొని, పకపకా నవ్వుకోసాగాయి.**

**అప్పన్న మాత్రం, కడుపునిండా తిని, నిద్రపోయాడు.**

సుబ్బారావు, ఉత్తరంలోని ప్రతి వాక్యాన్ని జాక్సన్ దొరకు కావాల్సినట్లుగా మార్చడం కోసం, ఇంగ్లీష్ పదాలతో, గ్రామర్‌తో కుస్తీ పడసాగాడు.

సుబ్బారావుకు ఇంగ్లీష్ వారి కంటే, ఇంగ్లీష్ భాషపై పిచ్చి కోపం వచ్చింది.

మూడక్షరాల పదంలో, మధ్యలో U అక్షరం ఉంటే Put ను పుట్ అనీ... But ను బట్ అనీ ఓ పద్ధతీ పాడూ లేకుండా చదివే... ఈ ఆంగ్లేయులు తమ భాషను, మన మీదేసి రుద్దు తున్నారు. Walk ను వాక్ అనీ... Talk ను టాక్ అనీ చదివి చావాలిట! L అక్షరాన్ని,

పక్కోడికి కూడా తెలియకుండా... విరోచనం మాత్ర దిగమింగినంత గుంభనంగా దిగమింగాలిట... దిక్కుమాలిన సంత అని!

Know, Knee, Knife ఈ పదాలలో Kను కాస్తా ఎవడికీ తెలియకుండా హత్య చేసి, గుంభనంగా సమాధిలో పాతి పెట్టేసే హంతకుల లాగా... పాతేసి మరీ ఆ పదాలు చదవాలిట!

అప్పుడెప్పుడో చిన్నప్పుడు, తెలుగులో ఆవు వ్యాసం అక్షర దోషాలతో రాస్తే, గోడ కుర్చీ వేయించి...అంతటితో వదిలెయ్యక, పాతికసార్లు అదే ఆవు వ్యాసం రాయించిన వీరయ్య పంతులు గుర్తొచ్చారు. ఆ రోజు తాను గోడకుర్చీ వేసినప్పుడు... తన లాగు పర్...ర్ర్...ర్...మనే శబ్దంతో చిరగడం, రెండో వరసలో కూర్చునే సెట్టిగారి అమ్మాయి సరళ తనను చూసి పకపకా నవ్వడం గుర్తొచ్చాయి సుబ్బారావుకు.

ఇప్పుడు...ఈ ఇంగ్లీష్‌లో కంప్లైంట్ సరిగ్గా రాయలేక, జాక్సన్ దొర చేతిలో...చీవాట్లు తింటుంటే, ఆనాటి గోడకుర్చీయే నయమనిపిస్తోంది. అప్పుడు సరళ ఒకందుకు నవ్వితే, ఇప్పుడు అప్పన్న తన వంక చూసి ఎందుకు నవ్వుతున్నాడో మాత్రం అర్థం కావడం లేదు.

ఓ పక్క ఇంగ్లీషును తిట్టుకుంటూ, మరోపక్క ఉత్తరం రాయడానికి వాక్యాలు, పదాలు వెతుకుతూనే... ఇంకోపక్క మనసులో ఓ మూల తీవ్రంగా ఇలా ఆలోచిస్తున్నాడు.


'అసలు ఈ బ్రిటీషోడు మన దేశానికి రావడమేంటి?... వాడి భాష



మన నెత్తిమీదేసి రుద్దడం ఏంటి? మేము, అధికారికంగా రాయాల్సిన ప్రతీ ఉత్తరం...ఈ ఇంగ్లీష్‌లో రాయడం ఏంటి? అసలు నాకు ఈ అప్పన్న పరిచయం అవడమేంటి? అప్పన్న కూడా ఆ వజ్రాల నెక్లెస్ దొంగతనంలో పాలు పంచుకోవడమేంటి?... ఈ నిజాం రాజ్యపు అడవుల్లో మాకు ట్రైనింగ్ ఏంటి?'


ఈ సారి ఉత్తరాన్ని జాగ్రత్తగా పూర్తి చేసి(!), ఎక్కడ అప్పన్న చూస్తాడోనని భయం వేసి... ఉత్తరాన్ని తన పెట్టెలో పెట్టి... పక్క మీద ఒరిగాడు.

'హమ్మో...నేను నిద్రపోయాక, అప్పన్న నా పెట్టె వెతికి మరీ ఆ ఉత్తరాన్ని తీసి చదువు కుంటే?' అని అనుకుని, పైకి లేచి, పెట్టెలో నుండి ఉత్తరాన్ని తీసి, ఎక్కడ దాయాలో అర్థం కాక కాసేపు అటూ ఇటూ తిరిగాడు.




ఈసారి, తాను వేసుకున్న ప్యాంటులో దాచి పెట్టుకొని మరీ నిద్రపోయాడు.

సుబ్బారావుకు ఓ విచిత్రమైన కల వచ్చింది.




ఆ కలలో తాను ఆ ఉత్తరాన్ని... జాక్సన్ దొరకు ఇచ్చాడు. జాక్సన్ దొర, వెంటనే అప్పన్నను అరెస్టు చేయించి కోర్టులో హాజరు పరిచాడు.

కోర్ట్ అప్పన్నకు ఉరిశిక్ష విధించింది.

ఉరి తీసే ముందు, జైలరు అప్పన్నను... చివరి కోరిక ఏంటి అని అడిగాడు.

దానికి, అప్పన్న... 'సుబ్బారావు రాసిన కంప్లైట్ ఉత్తరాన్ని నాకు ఇస్తే... ఆ ఉత్తరాన్ని నా పళ్ళతో... పరపర నమిలి ఊసేస్తాను...'' అని అడిగాడు.

జైలర్, సరేనని...కోర్టు ఫైల్స్‌లో భద్రపరిచిన ఆ ఉత్తరాన్ని తీసుకొచ్చి అప్పన్నకు ఇచ్చారు.

అప్పన్న, ఆ ఉత్తరాన్ని పరపరా నమిలా ల్సిందిపోయి, కరకరా నమలసాగాడు. మామూలుగా మనుషులు కాగితాలు నమిలితే వచ్చే శబ్దం కాదది. మొనదేలిన పళ్ళతో నమిలితే వచ్చే శబ్దం అది.

అప్పన్న, సుబ్బారావు వంక చూసి– "సుబ్బారావుగారు... సుబ్బా రావు గారు!..." అని పిలిచాడు.

"కాగితాలు నమిలింది చాలు! వెళ్ళి ఉరి కంబానికి వేలాడండి!" అన్నాడు సుబ్బారావు.

"ఉరికంబం ఏమిటండి? లేవండి!..." అన్నాడు అప్పన్న.

"నేను లేవడం ఏంటి?... నిలబడే ఉన్నానుగా!" అన్నాడు అప్పన్న.

ఈసారి సుబ్బారావు వంటి మీద చేయి పడడంతో, నిద్ర మత్తు వదిలింది.

ఎదురుగా అప్పన్న నిలబడి ఉన్నాడు.

"అదేంటి! మీకు జడ్జి ఉరిశిక్ష విధించారు కదా? చివరి కోరిక కింద... ఉరికంబం ఎక్కే ముందు లెటర్ నమిలి ఊసేస్తా... అన్నారు కదా?" అన్నాడు సుబ్బారావు.

అప్పన్న నవ్వి– "అది మీ కల మాత్రమే!" అన్నాడు అప్పన్న నవ్వుతూ.

"ఏంటి కలా?..."అన్నాడు సుబ్బారావు బాధగా.

"నేను... నిజంగా ఉరికంబం ఎక్కలేదని తెలిసి, బాగా ఫీల్ అయినట్లున్నారే!" అన్నాడు అప్పన్న.

"అది సరే... నన్నెందుకు నిద్ర లేపారు?... ఇంకా తెల్లార లేదు కదా?..." అన్నాడు సుబ్బారావు విసుగ్గా.

"మీ వైపు నుండి... ఏదో కరకరా శబ్దం వస్తేనూ... నిద్ర లేచి వచ్చి మరీ మిమ్మల్ని లేపాను!" అన్నాడు అప్పన్న.

"నా ఉత్తరాన్ని కరకరా తమరే నమిలారు కదా! అది ఆ శబ్దమే!" అన్నాడు సుబ్బారావు వెటకారంగా.

"నేను ఉత్తరం నమలడం ఏంటి?" అన్నాడు అప్పన్న.

"అదే... కల అని అర్థం అయ్యింది కదా? వెళ్ళి పడుకోండి..." అన్నాడు సుబ్బారావు.

"కలలోని శబ్దం ఇలలో నేనెలా ఆలకిస్తాను? నిజంగా కరకరా శబ్దం వచ్చింది కాబట్టే... నేను వచ్చాను!" అన్నాడు అప్పన్న.

సుబ్బారావు, అప్పన్న వంక మళ్ళీ, విసుగ్గా చూసాడు.

"ఒకసారి మీరు పైకి లేవండి! ఆ శబ్దం మీ వైపు నుండే వచ్చింది!" అన్నాడు అప్పన్న.

"ఏంటిపుడు? నేనేమైనా... నా దుప్పట్లో కరప్పూసో, అప్పాలో దాచుకొని, మీకు పెట్టకుండా... అర్ధరాత్రి కరకరా నమిలి మింగేస్తున్నానని... మీ సందేహమా?" అన్నాడు సుబ్బారావు.

"అదంతా నాకు తెలియదు. శబ్దం మాత్రం వచ్చింది... ఓసారి లేవండి!" అన్నాడు అప్పన్న.

సుబ్బారావు విసుక్కుంటూనే... దుప్పటి తీసి పారేసి, లేచి నిలబడ్డాడు.

సుబ్బారావు వేసుకున్న ప్యాంటులో నుండి... ఉత్తరం తాలూకు కాగితాలు చీలికలు పేలికలై కిందపడ్డాయి.


వాటి మధ్యలో నుండి, ఓ పెద్ద చుంచెలుక బయటకొచ్చి బయటకు పరుగెత్తింది. సుబ్బారావు భయంతో చెంగున గెంతాడు.


అప్పన్న పకపకా నవ్వి– "నా పై రాసిన కంప్లైంట్ లెటర్‌లో మాంచి ఉల్లిపాయ పకోడి లాంటి ఘాటు సరుకు ఉన్నట్లుందే!... అందుకే ఎలుక మీ ప్యాంటులో దూరింది!" అన్నాడు.

సుబ్బారావుకు తన ప్యాంట్‌లో ఎలుక దూరిందనే భయం ఒక వంక, అంత కష్టపడి రాసిన ఉత్తరాన్ని కరకరా నమిలేసి వెళ్ళిందనే బాధ ఇంకో వంక... వీటి మధ్యలో ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

"సుబ్బారావు గారు! ఈసారి ఉత్తరం రాస్తే ప్యాంటులోనూ, చంకలోనూ... దాచిపెట్టుకోకండి. జాక్సన్‌దొర గారికి ఇస్తే, ఆయన ఆ ఉత్తరం తీసుకొని చదవాలన్నా అసహ్యంగా ఉంటుంది. ఈ సారి ఉత్తరం రాసిస్తే, నేనే, నా ఇనుపపెట్టెలో భద్ర పరుస్తాను. సరేనా? ఇక పడుకోండి." అన్నాడు అప్పన్న. **(సశేషం)**























Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P




చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548

Hasyanandam April-2023. RNI No. APTEL 08387/01/1/2003-TC

రండి!  దర్శించండి!!  తరించండి!!!

# శ్రీ అష్టాదశ శక్తిపీఠ సహిత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం



కీ॥శే॥ శ్రీ గట్టు రాం రాజేశం గుప్తగారి సత్సంకల్పముతో...

గౌ॥ శ్రీమాన్ కె.వి.రమణాచారి IAS, Retd గారి పర్యవేక్షణలో...

## ఆనంద నిలయం ఆవరణలో
## గ్రా॥ కొండపాక. జి॥ సిద్ధిపేట

అమ్మవారి అనంతరూపాలలో అష్టాదశ శక్తి స్వరూపాలు అత్యంత శక్తివంతమైన రూపాలు. ఒక్కో రూపం ఒక్కోరకంగా ప్రభావవంతమైనది. అమ్మవారి ఆవిర్భావంతో, మన భారతావని పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుచున్నది. అంతటి గొప్ప మహిమాన్విత శక్తిపీఠ క్షేత్రంగా భారతదేశంలో, మన తెలంగాణ రాష్ట్రంలో సిద్ధిపేట జిల్లాలోని కొండపాక గ్రామంలో ఆగమశాస్త్ర విధానంలో వాస్తురీత్యా చక్కని శిల్పసంపదతో నాణ్యత గల నిర్మాణముతో శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాధీశ్వరుల.... ఆశీరనుగ్రహ నిర్వహణలో త్యాగధనుల విరాళములతో ఒక అద్భుతమైన అష్టాదశ శక్తి క్షేత్రంగా శాస్త్రీయ విధానంగా అతి త్వరలో వైభవోపేతంగా ప్రతిష్ఠింపబడుతున్నదని తెలుపుటకు సంతోషిస్తున్నాం. ఇంకా నిర్మాణంగా నున్న, రాజగోపురం, ధ్యాన మండపం, యజ్ఞశాల, వంటశాల, అర్చకుల గృహసముదాయం, భక్తులకు నివాస వసతి గృహసముదాయం అనేక హంగులతో సొబగులతో నిర్మించుటకు సంకల్పించినాం. ఇంతటి గొప్ప విశిష్ఠత గల వైభవోపేతమైన **ఈ శాస్త్రీయ అష్టాదశ శక్తిపీఠ రామలింగేశ్వర స్వామి క్షేత్రానికి భక్తులు, దాతలు యధామతిగా యధారీతిన తమ తమ శక్త్యానుసారంగా తను, మన, ధన, సేవా సహకారాలందించి ఈ పవిత్ర పుణ్యకార్యక్రమంలో యధోచితంగా పాల్గొనగలరని సకల భక్తజనావళిని సాదరపూర్వకంగా ఆశిస్తూ ఆహ్వానిస్తున్నాం.**

**ఆలయ ట్రస్టు సభ్యులుగా చేరడానికి రూ.3,00,000 విరాళం అందించి**
**శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కండి!**

ట్రస్ట్‌కు ఇచ్చే విరాళాలకు ఇన్‌కంటాక్స్ 80-జి సెక్షన్ ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది.

**Provisional Approval Number AAHTA 8091JF20206**

Ashtadasha Shakthi Peetha Sahitha Ramalingeswara Swamy Charitable Trust,
A/C.No-39153802660, IFSC-SBIN005881, Branch: SBI, ADB, Siddipet

వివరాలకు సంప్రదించండి:

శ్రీ అయిత నాగరాజు-9583599999, శ్రీ పెద్ది వైకుంఠం-9440003943, శ్రీ గట్టు రవీందర్-9848504656